PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 116 | విజయవాడ, ఆదివారం 27 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 27 November 2022 | Rs

'పిఎస్ఎల్వి-సి54'

## సక్సెస్

- నింగిలోకి 9 ఉపగ్రహాలు

**ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుండి శనివారం ఉదయం 11 గంటల 56 నిమిషాలకు ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి 54 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా ఇఒఎస్-6 ఉపగ్రహంతోపాటు మరో ఎనిమిది నానో ఉపగ్రహాలను విజయవంతంగా రెండు వేర్వేరు అంతరిక్ష కక్ష్యల్లోకి పంపారు. బంగారు వర్ణంలో నిప్పులు చెరుగుతూ ఆకాశం వైపునకు రాకెట్ దూసుకెళ్లింది. సరిగ్గా 17 నిమిషాల 21 సెకండ్లకు రాకెట్ పైభాగంలోని ఓషన్‌శాట్ ఉపగ్రహాన్ని కక్ష్యలో నిలిపింది. ఈ ఉపగ్రహం అంతరిక్షం నుంచే సముద్ర గర్భంలో చేపల ఉనికిని తెలియజేస్తుంది. అనంతరం రాకెట్‌లోని చివరి భాగం దిశ మార్చుకుని మరో దిశవైపు ప్రయాణించి మిగిలిన ఆస్ట్రోకాస్ట్ ఉపగ్రహాలు నాలుగింటిని, తైబోల్ట్ ఉపగ్రహాలు రెండింటిని, ఆనంద్ ఉపగ్రహాలతోపాటు ఇండియా భూటాన్ సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహాన్ని కక్ష్యలో నిలపడంతో ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగం పూర్తి కావడానికి రెండు గంటల ఐదు నిమిషాల సమయం పట్టింది. ఈ ప్రయోగ విజయం ఇస్రో వర్గాల్లోనే కాకుండా భూటాన్ ప్రజల్లోనూ ఆనందాన్ని నింపింది. భూటాన్‌లో మానవ వనరుల అవసరాలకు, సాంకేతిక అభివృద్ధికి ఐఎన్ఎస్-2బి ఉపగ్రహాన్ని భారత్ సహకారంతో ప్రయోగించారు.

**గవర్నర్, సిఎం అభినందన**

సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం పిఎస్ఎల్వి-సి54లో ఓషన్‌శాట్-ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ల ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో శాస్త్రవేత్తలను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సిఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని కోరారు.

పోరాడి ఓడిన సౌదీ అరేబియా

- ట్యునీషియాపై ఆస్ట్రేలియా గెలుపు

# హోదా ద్రోహం బిజెపిదే

## వైసిపి, టిడిపిలకూ భాగం

## ఆత్మగౌరవం తాకట్టు పెట్టారు

## జంతర్‌మంతర్ ధర్నాలో డి.రాజా, బివి రాఘవులు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా బిజెపి ద్రోహం చేస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు అన్నారు. బిజెపి చేసిన ఈ ద్రోహంలో వైసిపి, టిడిపిలు భాగం అయ్యాయని అన్నారు. ఢిల్లీ గద్దె వద్ద రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసే పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద శనివారం ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ పార్లమెంట్‌లో విభజన బిల్లుపై జరిగిన చర్చలో బిజెపితో సహా అన్ని పార్టీలు ఏపికి ప్రత్యేక హోదా అవసరమని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చిందన్నారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోగా ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు సిద్ధపడ్డారని, గంగవరం పోర్టును అదానీకి అప్పగించారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హోదా డిమాండ్‌ను ఎందుకు లేవనెత్తడం లేదని ప్రశ్నించారు.

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా ఇస్తామని, తెస్తామని చెప్పిన పార్టీలు, ఆంధ్రప్రదేశ్‌కు, తెలుగు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి రాష్ట్రంలో అధికార వైసిపి వత్తాసు పలుకుతూ ఆ ద్రోహంలో పాలుపంచుకుంటుందని విమర్శించారు. "ఇటీవలి ప్రధాని మోడీ వైజాగ్‌ను సందర్శించినప్పుడు ఆయన సమక్షంలో సిఎం వైఎస్ జగన్, తనకు ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి రాజకీయాలకు అతీతంగా ప్రత్యేకమైన సంబంధం ఉందని ప్రకటించారు. ద్రోహం చేసేవారితో అంత స్నేహం ఏమిటి? అని ప్రశ్నించారు. ప్రధానిని ముఖ్యమంత్రి కలవడంలో తప్పు లేదని, అయితే, రాష్ట్రానికి మోసం చేసిన వారి పట్ల ఎందుకంత సానుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు 'దీనివల్ల తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలగడంతో పాటు, రాష్ట్ర ప్రజలు, యువత ఆకాంక్షలు తీవ్రమైన హాని కలుగుతోంది.' అని చెప్పారు. 'మరోవైపు ప్రతిపక్ష టిడిపి, జనసేనలు కూడా బిజెపి, మోడీ ప్రాపకోసం తహతహలాడుతున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు బిజెపి ద్రోహంలో పాలుపంచుకుంటూ తెలుగు ప్రజలకు హాని చేస్తున్నాయి" అని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన మతోన్మాద బిజెపికి, ఆ ద్రోహికి వంతపాడుతున్న వైసిపి, టిడిపి లాంటి పార్టీలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హెూదా కోసం అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు కూడా గతంలో ధర్నాలు చేశాయని, ప్రధాని మోడీకి భయపడి ఇప్పుడు మౌనంగా ఉన్నాయని విమర్శించారు. జనసేన పవన్ కళ్యాణ్ ధర్నా చేశాడని, ఇప్పుడు బిజెపి పంచన చేరాడనిఅన్నారు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి ఏరోజూ నిలదీసిన పాపాన పోలేదని, టిడిపి కూడా మౌనంగా ఉందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి వంతపాడుతున్నాయని విమర్శించారు.

**వైసిపి విఫలం : చలసాని శ్రీనివాస్**

ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలను నిరాకరించి, రాజ్యాంగ స్ఫూర్తికి బిజెపి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేస్తే తమపై కేసులు పెడుతున్నారని చెప్పారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని చెబుతున్న బిజెపి నేతలు, ఈశాన్య రాష్ట్రాలకు 2017 వరకు ప్రత్యేక హోదా ఇస్తూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులపై ఏమంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతానని అన్న సిఎం వైఎస్ జగన్ మాటలు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపి బినయ్ విశ్వం, ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సదాశివరెడ్డి, ఎఐకెఎస్ నేత రావుల వెంకయ్య, కుమార్ చౌదరి యాదవ్, సాకే నరేష్, విద్యార్థి, యువజన నేతలు ఎన్.లెనిన్ బాబు, జాన్సన్‌బాబు, రవీంద్ర, పరమేష్, ఎఐఎస్ఎఫ్ నేత సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్‌లో ప్రసంగిస్తున్న డి రాజా, బివి రాఘవులు

## ప్రి బడ్జెట్ సమావేశం బహిష్కరిస్తాం

- సంఘానికి 3 నిమిషాల సమయంపై ఆగ్రహం
- 10 కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం

**న్యూఢిల్లీ** : బడ్జెట్ ముందస్తు చర్చల్లో మాట్లాడేందుకు ఒక్కో సంఘానికి మూడు నిమిషాల సమయం కేటాయించడం పట్ల పది కేంద్ర కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశాయి. సోమవారం ఆర్థిక మంత్రితో జరిగే 75నిముషాల వర్చువల్ మోడ్ సమావేశానికి తమకు ఆహ్వానం అందిందని ఆ లేఖలో పేర్కొన్నాయి. ఈ నెల 25న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పంపిన ఇ మెయిల్‌లో ప్రతి కేంద్ర కార్మికసంఘం మాట్లాడేందుకు మూడు నిమిషాలు కేటాయించారని, ఇది జోక్ చేసినట్లుగా ఉందని, ఇందులో పాల్గొనేందుకు నిరాకరిస్తున్నామని తెలిపాయి. ఈ మేరకు ఫోరమ్‌గా ఏర్పడిన 10 కేంద్ర కార్మిక సంఘాలు ఆర్థిక మంత్రిత్వశాఖకు లేఖ పంపించాయి. సమావేశపు ప్రారంభ పలుకులు వంటి సాంప్రదాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఇంకా ఆ సమయం తగ్గే అవకాశముందని ఆ లేఖలో సంఘాలు పేర్కొన్నాయి.

సమాజంలో అత్యంత నిర్మాణాత్మక విభాగానికి ప్రాతినిధ్యం వహించే కార్మిక సంఘాలకు సహేతుకమైన సమయాన్ని కేటాయించాలని, అప్పుడే సమర్థవంతంగా బడ్జెట్ ముందస్తు చర్చలు జరపడానికి వెసులుబాటు వుంటుందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. వర్చువల్‌గా కాకుండా, బహిరంగంగా చర్చించాలని డిమాండ్ చేశారు.

# రాందేవ్ బాబా నోటి దురుసు

- మహిళలపై అసభ్య వ్యాఖ్యలు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళా కమిషన్
- నోటీసులు జారీ

**న్యూఢిల్లీ, అమరావతి బ్యూరో, తిరుపతి టౌన్ :**

యోగా, ఆయుర్వేదం పేరిట ప్రజల భావోద్వేగాలను సరుకుగా మార్చి వేలాది కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న పతంజలి అధినేత రాందేవ్ బాబా మరోసారి తన నోటి దురుసును ప్రదర్శించారు. మహిళల పట్ల అసభ్య వ్యాఖ్యలు చేయడానికి బరితెగించారు.

థానేలో ముంబయి మహిళా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఒక యోగా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'మహిళలు చీరలో బాగుంటారు. సల్వార్ సూట్స్‌లోనూ బాగా కనిపిస్తారు. నా కళ్లతో అయితే వాళ్లు ఏమీ ధరించకపోయినా చాలా బాగుంటారు' అని అన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. మహిళా సంఘాలతో పాటు పలువురు రాందేవ్ బాబా వ్యాఖ్యలను ఖండించారు. అయితే, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృత ఫడ్నవీస్ సమక్షంలోనే రాందేవ్‌బాబా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆమెతో పాటు మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే తనయుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే సహా పలువురు ప్రముఖ బిజెపి, సంఘ్ పరివార్ నేతలు మిగతా 5లో

హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు

### క్షమాపణ చెప్పాలి : ఐద్వా డిమాండ్

స్త్రీల పట్ల, వారి వస్త్రధారణ పట్ల విపరీత వ్యాఖ్యలు చేసి, యావత్ మహిళాలోకాన్ని అవమానించిన రామ్‌దేవ్ బాబాక్షమాపణలు చెప్పడంతో పాటు ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గరికపాటి నరసింహారావు స్త్రీలపట్ల అసభ్యకరంగా మాట్లాడారని, వారి వ్యాఖ్యలు మరువక ముందే తాజాగా రామ్‌దేవ్‌బాబా మాట్లాడుతున్నారని అన్నారు దేశంలో పురుషాధిక్యత, స్త్రీలను చులకనగా చూసేవారు అనేకమంది స్త్రీల వస్త్రధారణ చుట్టే తిరుగుతూ వారు పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. రామ్‌దేవ్‌బాబాపై తక్షణమే నిర్భయచట్టం కింద కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### సామరస్యతకు రాజ్యాంగ నిర్మాతల కృషి

- నయా అంటరానితనం మీద విద్యాసంస్కరణలతో పోరాటం
- సిఎం జగన్

లోపలి పేజీలో..

### రుషికొండ తవ్వకాలపై వాస్తవాలు వెల్లడించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

లోపలి పేజీలో..

### మతతత్వ అజెండాతోనే బిజెపి మేనిఫెస్టో

- యుసిసి తెస్తామని హామీ
- యుపి తరహాలో నష్ట పరిహార చట్టం

# రాజ్యాంగమే అతిపెద్ద బలం

- ప్రధాని మోడీ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

దేశానికి రాజ్యాంగమే అతిపెద్ద బలమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. శనివారం సుప్రీం కోర్టులో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సుప్రీం కోర్టు ఇ -ఇనిషియేటివ్ (వర్చువల్ జస్టిస్ క్లాక్, జస్టిస్ మొబైల్ యాప్ 2.0, డిజిటల్ కోర్టు, ఎస్3వాస్ వెబ్‌సైట్‌లు)లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని క్రమం తప్పకుండా బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాజ్యాంగ సభలోని మహిళల త్యాగాల గురించి చర్చ చాలా అరుదుగా ఉంటుందని, కనుక వారి గురించి యువతకు అవగాహన కల్పించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. "రాజ్యాంగ అసెంబ్లీలో 15 మంది మహిళలు ఉన్నారు. వారిలో వెనుకబడిన సమాజానికి చెందిన దాక్షాయణి వేలాయుధన్ కూడా ఉన్నారని చెప్పారు.

**ప్రజలకు న్యాయ వ్యవస్థ చేరువ కావాలి : జస్టిస్ డివై చంద్రచూడ్**

న్యాయ వ్యవస్థకు ప్రజలు చేరువ కావడానికి బదులు, ప్రజలకే న్యాయ వ్యవస్థే చేరువ కావాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు. రాజ్యాంగం చారిత్రాత్మకంగా అధికారంలో ఉన్న వారికి, అట్టడుగున ఉన్నవారికి మధ్య ఒక సామాజిక ఒప్పందమని పేర్కొన్నారు. దేశంలోని జిల్లా కోర్టుల నుండి అత్యున్నత న్యాయస్థానం వరకు పౌరుల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పొందడంపై ప్రతిబింబించడం చాలా ముఖ్యమని అన్నారు. సామాన్యులు అర్థం చేసుకునేందుకు కోర్టుల్లో స్థానిక భాషలను అమలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. న్యాయ విద్యను స్థానిక భాషలోనే నిర్వహించాలని చెప్పారు.ప్రతి పంచాయితీకి తప్పనిసరిగా న్యాయ సలహా విభాగం ఉండాలని అన్నారు. అట్టడుగు స్థాయిలో న్యాయ సేవలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ఏజి నొక్కి చెప్పారు.

ఇ -ఇనిషియేటివ్ ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ, సిజెఐ చంద్రచూడ్

కేశవరెడ్డి స్మారక సభలో మాట్లాడుతున్న అవార్డు గ్రహీత ఎస్ఆర్ పరిమి

# కేశవరెడ్డి సేవలు మరువలేనివి

- సాహితీ అవార్డు ప్రదానోత్సవ సభలో ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు
- ఎస్ఆర్ పరిమికి సాహితీ పురస్కారం అందజేత

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కొమ్మారెడ్డి కేశవరెడ్డి ఉపాధ్యాయుడిగా, ఉద్యమ నాయకునిగా, సాహితీవేత్తగా, అనువాదకుడిగా, చరిత్రకారుడిగా బహుముఖ కృషి చేశారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. 'ఐక్య ఉపాధ్యాయ' పూర్వ ప్రధాన సంపాదకులు కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభ శనివారం బాలోత్సవ భవన్‌లో జరిగింది. యుటిఎఫ్, సాహితీ స్రవంతి, ప్రజాశక్తి బుక్‌హౌస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సభకు యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ, గణిత ఉపాధ్యాయునిగా ఉండి చరిత్ర పుస్తకాలను కొమ్మారెడ్డి అనువదించడం ఆయనకు సాహిత్యం పట్ల వున్న మక్కువను తెలియజేస్తోందని అన్నారు. భారతదేశ విద్యారంగం చరిత్ర గొప్ప పుస్తకం రచించారని కొనియాడారు. వికాస విద్యావనం వ్యవస్థాపకులు ఎస్ఆర్ పరిమి విద్యారంగం పట్ల స్పష్టమైన భావాలు, ఆలోచనలు ఉన్న వ్యక్తి కావడం వల్లే ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక మిగతా 5లో

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టుల మృతి

**ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మిట్టూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రోమ్ర అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, సిఆర్‌పిఎఫ్ బలగాలు ప్రోమ్ర అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేట్టాయి. మావోయిస్టులు ఎదురుపడడంతో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో ఒక 303 రైఫిల్, రెండు 315 రైఫిల్స్, మస్కట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది మావోయిస్టులు అటవీ ప్రాంతంలోకి పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మావోయిస్టుల మృతదేహాలను బీజాపూర్ జిల్లా కేంద్రానికి పోలీసులు తరలించారు.

# సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

- గ్రాట్యుటీ, కనీస వేతనాల అమలుకు ఉద్యమం
- అంగన్‌వాడీ రాష్ట్ర పదో మహాసభ పిలుపు
- బేబీరాణి, సుబ్బరావమ్మ అధ్యక్ష, కార్యదర్శులుగా 89 మందితో నూతన కమిటీ ఎన్నిక

బేబీరాణి

సుబ్బరావమ్మ

**ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, గుంటూరు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి రానున్న రోజుల్లో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర పదో మహాసభ పిలుపునిచ్చింది. మహాసభలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా జి.బేబీరాణి, కార్యదర్శిగా కె.సుబ్బారావమ్మ, కోశాధికారిగా ఎస్.వాణిశ్రీ ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా 32 మంది ఎన్నుకోబడ్డారు. మొత్తం 89 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో రెండ్రోజులపాటు జరిగిన ఈ మహాసభ శనివారం ముగిసింది. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ తర్వాత గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు న్యాయపోరాటం కూడా చేయాలని మహాసభలో నిర్ణయించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఉద్యోగోన్నతులు కల్పించాలని, రవాణా ఛార్జీలు ఇవ్వాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తల్లులకు, పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని, మెనూ ప్రకారం ఆహార ఉత్పత్తులు అందించాలని కోరింది. రెండో రోజు ప్రారంభ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం వంటి స్కీములను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. అంగన్‌వాడీలు ఇతర స్కీం వర్కర్లను, కార్మికులను, ఉద్యోగులను కలుపుకొని ఐక్య పోరాటాలు చేయాలన్నారు. ప్రజలు, కార్మిక, ఉద్యోగుల పట్ల బాధ్యత లేకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఛాయ్ వాలాగా చెప్పుకుంటున్న మోడీకి కష్టజీవుల వెతలు పట్టవా? అని ప్రశ్నించారు. అంబానీ, అదాని ఆస్తులు పెంచడానికే మోడీ మిగతా 5లో

గుంటూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

## డ్యూటీ సర్టిఫికెట్ లేకుండా జీతాలు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సచివాలయ ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్ లేకుండానే జీతాలు చెల్లించేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. 'డ్యూటీ సర్టిఫికెట్ ఉంటేనే జీతాలు' అన్న శీర్షికతో శనివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. డ్యూటీ సర్టిఫికెట్ లేకుండానే సచివాలయ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ శనివారం మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. 'ప్రజాశక్తి'కి సచివాలయ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

## సుశీల్‌కుమార్‌మిశ్రో, విజయలక్ష్మిలకు ఎన్‌టిఆర్ శతాబ్ది రంగ స్థల పురస్కారాలు ప్రదానం

**ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)**

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెనాలిలోని కొత్తపేట ఎన్‌జిఒ కళ్యాణ మండపంలో శనివారం రాత్రి ఎన్‌టిఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలను ప్రముఖ సినీ, రంగస్థల నటులు, దర్శకులు, ప్రయోక్త సుశీల్‌కుమార్ మిశ్రా, రంగస్థల నటి కె.విజయలక్ష్మికి ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత సుశీల్‌కుమార్ మిశ్రో మాట్లాడుతూ తెనాలి కళా వైభవానికి ప్రతీక ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాలని తెలిపారు. ఎన్‌టిఆర్ పేరిట పురస్కారం దక్కించుకోవడం తన అదృష్టంగా చెప్పారు. కార్యక్రమానికి సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ అధ్యక్షత వహించగా, అంగలకుదురు సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. నాయుడు గోపి, షేక్ జానిబాషా, షేక్ ఖలీల్, టి.హరిప్రసాద్, కళాకారులు పాల్గొన్నారు.

## కొలీజియం వ్యవస్థను రద్దు చేయాలి : జల్లి విల్సన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సుప్రీంకోర్టు, హైకోర్టులలో న్యాయమూర్తుల నియామకం విషయంలో అట్టడుగు వర్గాలకు అన్యాయం జరుగుతున్న నేపథ్యంలో కొలీజియం వ్యవస్థను రద్దు చేయాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. వేదిక ఆధ్వర్యంలో 73వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవాడలోని ఐక్యతాభవన్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో విల్సన్ మాట్లాడుతూ రాజ్యాంగంలో కొలీజియం అంశం లేదని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తితో జడ్జిల నియామకం జరిగినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. గవర్నర్ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రెండవ సారి బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత లౌకికతత్వానికి పెనుప్రమాదం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ రాజ్యాంగ పీఠిక చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

## నైపుణ్యాలను పెంచుకోవడమే విద్య

- హోంమంత్రి వనిత

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మార్కులు తెచ్చుకోవటమే విద్యాభ్యాసం కాదని, జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచుకోవడమే విద్య అని రాష్ట్రహోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలీటెక్ ఫెస్ట్-2022 ముగింపు కార్యక్రమం విజయవాడలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు.గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, ప్రపంచ పోటీని తట్టుకునేలా ప్రతి విద్యార్థి తయారు కావాలని అన్నారు. . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ సిఇవో అనిల్ కుమార్, సాంకేతిక విద్య సంయుక్త సంచాలకులు పద్మారావు, కార్యదర్శి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు కాపుల సాధికారతకు కృషి : పవన్‌కల్యాణ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

తూర్పు కాపుల సాధికారికతకు జనసేన అండగా నిలుస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తూర్పు కాపులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉండగా, సర్టిఫికేట్ల జారీ మూడు ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితం చేయడమేంటని ప్రశ్నించారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా నిలుస్తామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

## కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదం

- యువకుడి పరిస్థితి విషమం

**ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు జిల్లా వింజమూరు మండలం చంద్రపడియ గ్రామంలోని శ్రీవెంకటనారాయణ ఫార్మసీ ఫ్యాక్టరీలో శనివారం ప్రమాదం చోటు చేసుకుంది. వింజమూరు చెన్నకేశవస్వామి దేవాలయం ప్రాంతానికి చెందిన మీరావలిపై కాల్షియం కార్బొనైట్ పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది నగరంలోని మెడికోవర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

# సామరస్యతకు రాజ్యాంగ నిర్మాతల కృషి

- విద్యాసంస్కరణలతో అంటరానితనం నిర్మూలన • సిఎం జగన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సమాజంలో సామరస్యాన్ని నెలకొల్పేందుకు రాజ్యాంగ నిర్మాతలు ఎంతో కృషిచేశారని, వారి సేవలను ప్రజలు ఎన్నటికీ మరువరని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. 73వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విజయ వాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ప్రభుత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి గవర్నర్, సిఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గవర్నర్ రాజ్యాంగ ప్రవేశికను చదివి వినిపిస్తూ ఆహూతులతో పలికించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య భావన ఎప్పటి నుండో ఉందని తెలిపారు. ప్రబలంగా ఉందన్న భావనను చాటిచెప్పేందుకు ఈ ఏడాది రాజ్యాంగ దినోత్సవాన్ని భారత్ లోక్‌తంత్రకీ జననీ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాచీన వేదకాలం నుంచి భారతీయులు సమానత్వ స్ఫూర్తితో లోక్‌తాంత్రిక్ పరంపరంను కలిగి ఉన్నారన్నారు. పౌరుల హక్కులను పరిరక్షించడం ద్వారా రాజ్యాంగం వారికి అధికారం ఇస్తుందని, పౌరుల విధులకు కట్టుబడి రాజ్యాంగానికి సాధికారత కల్పించారన్నారు.

ఎమర్జెన్సీ కాలం నాటి చీకటి రోజులను గవర్నర్ గుర్తు చేశారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ప్రపంచ వేదికపై దేశం నిర్వహించిన పాత్రను గవర్నర్ ప్రస్తావించారు. రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు ప్రధాని చొరవచూపారన్నారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయానికి, సామాజిక సాధికారతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రవేశిక చదువుతున్న గవర్నర్ విశ్వభూషణ్, సిఎం జగన్

ఇస్తోందన్నారు. రాజ్యాంగం గొప్పదని, 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలు, మూడువేల కులాలు, ఉపకులాలతో కలిపి 25 వేల కులాలు, ఏడు ప్రధాన మతాలు, 121 భాషలు, యాసలతో కలిపితే 19,500 భాషలు మాట్లాడే మన దేశంలో భిన్నమైన భౌగోళిక స్వభావాలు, వేర్వేరు ఆచార అలవాట్లు ఉన్న దేశంలో 140 కోట్లమందికి రాజ్యాంగం క్రమశిక్షణ నేర్పే ఒక రూల్ బుక్‌తో పాటు, దిశానిర్దేశం చేసే ఒక గైడ్, ఒక ఫిలాసఫర్, ఒక టీచర్ అని సిఎం పేర్కొన్నారు. దేశ సార్వభౌమాధికారానికి ప్రతీక రాజ్యాంగమని అన్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని రచించిన మహానుభావుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. రాజ్యాంగంలో చెప్పిన గ్రామస్వరాజ్యానికి రూపకల్పన చేసి దేశంలోనే తొలిసారిగా గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు ఇంగ్లీషు మీడియంలో చదువుకునే అవకాశం లేకుండా చేయడం ద్వారా రూపం మార్చుకుని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల పట్ల పాటిస్తున్న నయా అంటరానితనం మీద సిబిఎస్ఇ ఇంగ్లీషు మీడియంతో మొదలు బైలింగువల్ టెక్స్ట్ బుక్స్, డిజిటల్ క్లాస్‌రూముల వరకు విద్యారంగంలో సంస్కరణలు ద్వారా దండయాత్ర చేస్తున్నామని వివరించారు. విజయవాడ పట్టణం నడిబొడ్డున 2023 ఏప్రిల్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహా విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, సిఎస్ సమీర్‌శర్మ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, జిఎడి కార్యదర్శి ముత్యాలరాజు పాల్గొన్నారు.

# కోటంరెడ్డిపై దాడి

- ఇంటికొచ్చి కారుతో ఢీకొట్టిన వైనం
- కాలు విరగడంలో ఆస్పత్రిలో చేరిక

**ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు నగర టిడిపి అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డిపై శనివారం రాత్రి దాడి జరిగింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోటంరెడ్డి కుటుంబసభ్యుల కథనం ప్రకారం... నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు ఎదురుగా కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి రెండు కార్లలో కొందరు వ్యక్తులు ఆయన ఇంటికి వచ్చారు. వారిలో శ్రీనివాసులరెడ్డి కుమారుడు డాక్టర్ ప్రజయ్ శ్రీనారెడ్డి స్నేహితుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మరికొంతమంది ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఇద్దరి స్నేహితుల మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తన అనుచరులతో శ్రీనివాసులరెడ్డి ఇంటికి రాజశేఖర్‌రెడ్డి వచ్చారు. ఇంటి బయటకు వచ్చిన ఆయన తర్వాత మాట్లాడుకుందామని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో, కారును వేగంగా రాజశేఖర్‌రెడ్డి రివర్సు చేసి శ్రీనివాసులరెడ్డిని బలంగా ఢీ కొట్టాడు. రోడ్డుపై పడిపోవడంతో కాలుపై నుంచి కారు ఎక్కించాడు. దీంతో, శ్రీనివాసులరెడ్డి ఎడమ కాలు నుజ్జునుజ్జు అయింది. అనంతరం అక్కడి నుంచి రాజశేఖర్‌రెడ్డి వెళ్లిపోయాడు. శ్రీనివాసులరెడ్డిని కుటుంబ సభ్యులు అపోలో వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటంరెడ్డిని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పరామర్శించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ

శ్రీనివాసులరెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

నగరంలో డ్రగ్స్ మాఫియా ఎక్కువైందన్నారు. ఇటీవల కాలంలో వైసిపి నేతల నుంచీ హెచ్చరికలు వచ్చాయని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులరెడ్డిని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాజీ మంత్రి టి.రమేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ టి.అనూరాధ పరామర్శించారు. ఈ ఘటనపై టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసులరెడ్డిని, ఆయన భార్య సంధ్యాను ఫోన్లో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. దాడి ఘటన వెనుక రాజకీయ కోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు.

## వైజాగ్ టెక్నో పార్కు పేరుతో అదానీకి భూములు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

వైజాగ్ టెక్నో పార్కు పేరుతో మధురవాడలో 130 ఎకరాల భూమిని ఎకరా రూ.కోటి చొప్పున అదానీకి జగన్ ప్రభుత్వం కేటాయించిందని, దీనిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. విశాఖ నగరంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ భూమి కేటాయింపుపై ఈ ఏడాది జులై ఆరున సేల్ అగ్రిమెంటు, సేల్ డీడ్‌ను ప్రభుత్వం ఒకేసారి ఖరారు చేసిందన్నారు. ఇది పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు అదానీకే చెందిన వైజాగ్ టెక్నో పార్కు కంపెనీకి కడపకు చెందిన పాకనాటి అంజిరెడ్డి జనరల్ మేనేజర్‌గా ఉన్నారని తెలిపారు. ఇది ఒక విధంగా క్విడ్ ప్రో లాంటిదేనని ఆరోపించారు. ఈ భూ కుంభకోణంపై సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైజాగ్ టెక్నో పార్కు భూముల కేటాయింపు, సేల్ డీడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టిన విధంగానే ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములను మధురవాడలో అతనికే కట్టబెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు గఫూర్

## జనవరి 8, 9న ఆవాజ్ రాష్ట్ర మహాసభ

- ఆహ్వాన సంఘం చైర్మన్‌గా కెఎస్ లక్ష్మణరావు

**ప్రజాశక్తి-గుంటూరు**

గుంటూరులో జనవరి 8, 9న జరిగే ఆవాజ్ రాష్ట్ర రెండవ మహాసభ నిర్వహణకు ఆహ్వాన సంఘం ఎన్నికైంది. స్థానిక పాత గుంటూరు షాదిఖానాలో వివిధ మైనార్టీ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆహ్వాన సంఘం చైర్మన్‌గా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ కెఎస్ లక్ష్మణరావు, గౌరవాధ్యక్షులుగా ఎం కేఎస్ మోహిద్దీన్, అధ్యక్షులుగా డాక్టర్ ఏఎస్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ చిష్టీ, కోశాధికారిగా ఎస్.కె.భాష, నగరంలోని అనేకమంది ప్రముఖులు, విద్యావేత్తలు, సేవా సంస్థల ప్రతినిధులతో కలిపి మొత్తం 32 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్ఎకె జిలాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్, బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంకెఎస్ మొహిద్దిన్ మాట్లాడారు. 2002 నవంబర్‌లో ఏర్పడిన ఆవాజ్ గత ఇరవై ఏళ్లుగా మైనార్టీల అభివృద్ధి, భద్రత, లౌకిక వాదం అనే మూడు లక్ష్యాలతో పనిచేస్తోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభ జయప్రదానికి లౌకిక, ప్రజాస్వామ్యవాదులు కృషి చేయాలని కోరారు. హోప్ విన్ హాస్పిటల్ డాక్టర్ షమ సుల్తానా, ముస్లిం ఐక్యవేదిక నాయకులు జియా ఉర్రహ్మాన్, అబ్దుల్ కలాం, ఖిద్మత్ బ్యాంక్ డైరెక్టర్ జాహిద్, బషీర్ అహ్మద్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు పాల్గొన్నారు.

## జనవరి 8న సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్ష

**ప్రజాశక్తి-విజయనగరం**

ఆలిండియా సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష (ఎఐఎస్ఎస్ఇఇ) వచ్చే ఏడాది జనవరి 8న జరగనుందని కోరుకొండ సైనిక స్కూలు ప్రిన్సిపల్ అరుణ్‌కులకర్ణి తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా 33 సైనిక్ పాఠశాలల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి ఎఐఎస్ఎస్ఇఇ పరీక్ష నిర్వహిస్తోంని తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థి వయస్సు 2023 మార్చి 31వ తేదీ నాటికి 10, 12 సంవత్సరాల మధ్య ఉండాలని, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 2023 మార్చి 31వ తేదీ నాటికి 13, 15 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. అడ్మిషన్ సమయంలో గుర్తింపు పొందిన పాఠశాల నుండి ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పరీక్ష రుసుము ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.500, ఇతరులకు రూ.650 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఆన్‌లైన్‌లో పంపాలని తెలిపారు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ https://aissee.nta.nic.inను సంప్రదించాలని సూచించారు.

## వైసిపిది రాజ్యాంగ వ్యతిరేక పాలన

- పోరాటానికి కలిసి రావాలి • రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు లేఖ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన జరుగుతోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. అధికారంలో ఉన్నామని, తామేం చేసినా చెల్లుతుందనే అహంకారంతో వైసిపి నాయకులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను, నియమాలను తుంగలో తొక్కుతూ ప్రజల హక్కులు, స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ రాశారు. ప్రజాస్వామ్య దేశంలో నియంతృత్వ పోకడలతో జగన్ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ టెర్రరిజంతో రాష్ట్రంలో అరాచక, ఆటవిక పాలన సాగుతోందని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలను, పాలకులు, పాలనను విమర్శించినా ప్రజలు, రాజకీయపార్టీలపై అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలనే కాకుండా మీడియా, న్యాయవ్యవస్థలపైనా దాడికి దిగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళలపై దాడులు పెరిగిపోయాయని, బడుగు, బలహీనవర్గాలపై శిరోమండనాలు, హత్యాయత్నాలు, అక్రమ కేసులు నాజీ పాలనను గుర్తుకు తెస్తున్నాయని విమర్శించారు. 42 నెలల్లో ప్రభుత్వ విధానాలకు సంబంధించి దాదాపు 330పైగా కేసుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పులు రావడం ప్రజావ్యతిరేక పాలనకు అద్దం పడుతోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో జరుగుతున్న రాజ్యాంగ వ్యతిరేక పాలనపై ప్రజలందరూ ఏకమై రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలని, లేదంటే రాష్ట్ర భవిష్యత్ అంధకారమవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజల హక్కుల రక్షణ కోసం ప్రతిపక్ష పార్టీగా టిడిపి చేసే పోరాటానికి ప్రజలంతా కలిసి రావాలని కోరారు.

## రుషికొండ విధ్వంసం ఆపాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

విశాఖలోని రుషికొండను సందర్శించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అనుమతించడంలేదో వివరణ ఇవ్వాలని, పర్యావరణాన్ని ధ్వంసం చేసే అనుమతులు కేంద్రం ఎలా ఇచ్చిందో సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. పర్యావరణానికి భంగం కలిగించి, విశాఖ రుషికొండను తవ్వి, ధ్వంసం చేసి ప్రైవేటుకు అప్పజెప్పే యత్నాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న నిర్మాణాలను చూడడానికి ఎందుకు ప్రభుత్వం అనుమతించడంలేదు ? ప్రతిపక్షాలను ఎందుకు అరెస్టులు చేస్తోంది ? సందర్శించాలంటే ఎందుకు కోర్టు అనుమతులు తీసుకోవాలి ? అసలు అక్కడేం జరుగుతోంది వంటి అనేక అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి సమాధానం ఇవ్వాలని కోరారు. రుషికొండపై ఎపి పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పునర్నిర్మిస్తున్న బీచ్‌రిసార్టు ప్రాజెక్టు అడ్డగోలుగా నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ, కోర్టులు చీవాట్లు పెట్టినప్పటికీ రాష్ట్ర మంత్రులు అడ్డగోలు వాదనలు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. రుషికొండ బీచ్ నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పాలనే దురుద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండబట్టే దాగుడుమూతలు ఆడుతోందని విమర్శించారు. సముద్ర తీరంలో రుషికొండ బీచ్ సామాన్యులకు, పర్యాటకులకు, పేదలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇస్తోందని, పర్యావరణానికి నష్టం కలిగించే అనుమతులు కేంద్రం హడావిడిగా ఎందుకిచ్చిందో వివరణ ఇవ్వాలని డిమాండు చేశారు. మరోవైపు రుషికొండ ప్రాంతంలో సర్వే నెం.29/1లో 4.97 ఎకరాలు ప్రభుత్వ భూమి భూకబ్జాదారుల చేతిలో ఉన్నప్పటికీ కిమ్మనకుండా స్థానిక ఎమ్మెల్యే వత్తాసు పలకడం అన్యాయమని, అధికారులు సర్వే చేసి నివేదిక ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. రుషికొండ తవ్వకాలపై ప్రజలకు, రాజకీయ పార్టీలకు ఉన్న అనుమానాలపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సందర్శనకు ఎటువంటి ఆటంకాలు కల్గించకుండా ప్రజలకు వాస్తవాలు వెల్లడించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

## మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి శ్రీనివాసరావు

చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగ లక్ష్యాలను విధ్వంసం చేస్తూ.. మరోవైపు రాజ్యాంగ దినోత్సవాలు నిర్వహిస్తుందని దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ కార్యదర్శి వి శ్రీనివాస రావు విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ అధ్యక్షతన 'మనువాదం వద్దు రాజ్యాంగం ముద్దు' అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు15 స్వాతంత్ర్య దినం, జనవరి 26 గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతలను తగ్గిస్తూ మోడీ పాలన సాగుతున్నదని తెలిపారు. సామాజిక న్యాయానికి విఘాతం కలిగించే ఉద్దేశంతోనే ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ రద్దు చేశారని, దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో వెనక్కి తగ్గారని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూ రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నారన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లలో సామాజిక న్యాయాన్ని సరిచేయాలన్నారు. దళిత క్రైస్తవులందరికి ఎస్‌సి హోదా కల్పించాలని తెలిపారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ.. సాంస్కృతిక సామాజిక రంగాల్లో సమరశీల పోరాటాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిపిఎస్‌కె రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వరు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కె.ధనలక్ష్మి

## ఉద్యోగ భద్రత కోసం ఉద్యమిద్దాం

- శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ కె.ధనలక్ష్మి

**ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)**

రాజధానిలో పారిశుధ్య కార్మికుల గోడు ప్రభుత్వానికి ఏమాత్రమూ పట్టడం లేదని, నాలుగు నెల్లుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమని శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ కె.ధనలక్ష్మి అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన దీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు దీక్షలను ధనలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. ఎవరి మీదో కోపం కార్మికుల మీద చూపిస్తారా..? వారి ఆకలి కేకలు వినిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కార్మికులంతా దళితులు, వెనకబడిన వారని తెలిపారు. వారికి అండగా సిఐటియు పోరాడుతుందన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా జీతాలు, పని భద్రత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇదే తీరు కొనసాగితే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కార్మికులకు ప్రతినెలా జీతాలు ఇవ్వకపోవడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడం, పిఎఫ్ సరిగా జమచేయకపోవడం, ఇఎస్ఐ కార్డులు ఇవ్వకపోవడం చట్ట వ్యతిరేకమన్నారు. కార్మికుల పొట్టగొట్టాలని చూస్తే సిఎం కుర్చీనే ఊడగొడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆర్‌టిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రమోహన్, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, అమరావతి జెఎసి నాయకులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వికటించిన మధ్యాహ్న భోజనం!

## 36 మంది విద్యార్థులకు అస్వస్థత

ఏలూరు జిల్లాలో విద్యార్థినులను పరామర్శిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ప్రజాశక్తి - పెదవేగి (ఏలూరు జిల్లా)**

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో శనివారం మధ్యాహ్న భోజనం వికటించి 36 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పశ్చిమగోదావరిలో 21, ఏలూరులో 15 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడ్డారు. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కుచింపూడిలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం కొద్దిసేపటికే ఇద్దరు విద్యార్థినులు వాంతులు చేసుకోగా, మరో 13 మంది కడుపునొప్పితో బాధపడ్డారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వారిని పెదవేగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ప్రధానోపాధ్యాయుడు సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తిన్న ఆహారాన్ని విశాఖపట్నంలోని ల్యాబ్‌కు పంపించాలని తహశీల్దారు నాగరాజును ఆదేశించారు. అక్కడ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవిని, డాక్టర్ మాధవిని కలెక్టర్ ఆదేశించారు. ఆహారం తినడం వల్ల ఇలా జరిగిందా? వేరేమైనా కారణాలున్నాయా? అనేదానిపై విచారిస్తున్నారు. దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చి అక్కడ విద్యార్థులతో మాట్లాడి, వారి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులోని ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకు చెందిన 180 మంది విద్యార్థులు.. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం వండిన గ్రీన్ రైస్ (పుదీనా అన్నం)ను మధ్యాహ్నం భోజనంగా తిన్నారు. కొద్దిసేపటికే 21 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో స్థానిక పిహెచ్‌సికి తరలించారు. మరో ఆరుగురు విద్యార్థులకు కడుపునొప్పి తీవ్ర ఇబ్బంది పడ్డారు. పుదీనా, కొత్తిమీర ఎక్కువ పరిమాణాల్లో వేయడంతో ఈ సమస్య వచ్చిందని ప్రాథమికంగా అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## పలువురు ఐఎఎస్ అధికారుల బదిలీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు శనివారం జిఓ ఆర్‌టి నెంబరు 2546ని విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా (కో ఆర్డినేషన్)గా విధులు నిర్వహిస్తున్న ఎన్. తేజ్‌భరత్‌ను తూర్పు గోదావరిజిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న శ్రీధర్ చామకూరిని సిసిఎల్‌ఎ కార్యాలయంలో జాయింట్ సెక్రటరీ (విజిలెన్స్)గా బదిలీ చేశారు. డాక్టర్ అపరాజిత సింగ్‌ను, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా, డాక్టర్ మహేష్ కుమార్ రావిరాలను పంచాయతీ రాజ్ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న టి.నిషాంతిని నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. సెలవులో ఉన్న ఎన్.మౌర్యను సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేసుకోవాలని జిఓలో పేర్కొన్నారు.

## పుట్టినరోజు వేడుకలో అపశృతి

- విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - రేణిగుంట (తిరుపతి)

పుట్టినరోజు వేడుకల్లో చోటు చేసుకున్న అపశృతి ఓ విద్యార్థి మృతికి కారణమైంది. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఎల్లమన్నెం పంచాయతీ మర్రిగుంట సమీపంలోని నారాయణ ఇంటర్మీడియట్ కళాశాల హాస్టల్‌లో గురువారం రాత్రి లోకకల్యాణ్ అనే విద్యార్థి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ క్రమంలో తోటి విద్యార్థులు స్నో స్ప్రే చేస్తుండగా రైల్వే కోడూరు చెందిన నవదీప్ అనే విద్యార్థి జారి కింద పడ్డారు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. సిబ్బంది, తోటి విద్యార్థులు చికిత్స నిమిత్తం రేణిగుంటలోని ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో అక్కడి నుంచి నారాయణాద్రి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థి తండ్రికి సిబ్బంది ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన ఆస్పత్రికి చేరుకున్నారు. కుమారుడి పరిస్థితి గమనించి చెన్నై అపోల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున నవదీప్ మరణించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేటియంకు ఆర్‌బిఐ షాక్

- కొత్త ఖాతాదారులను చేర్చుకోరాదు

**ముంబయి :** స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రముఖ డిజిటల్ చెల్లింపులు వేదిక పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్‌కు రిజర్వ్ బ్యాంక్ మరో షాక్ ఇచ్చింది. పేమెంట్ అగ్రిగేటర్ (పిఎ) సేవలు అందించేందుకు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. అనుమతులు మంజూరయ్యే వరకు కొత్త ఖాతాదారులను చేర్చుకోరాదని స్పష్టం చేసింది. వివిధ పద్ధతుల ద్వారా ఇ-కామర్స్, వ్యాపారులకు వినియోగదారులు చెల్లింపులు చేస్తుంటారు. దీనికి పేటియం లాంటి డిజిటల్ చెల్లింపుల వేదికలు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. కాగా.. ఆర్‌బిఐ నిర్ణయం తమ వ్యాపారంపై ఎలాంటి ప్రభావం చూపబోదని పేటియం పేర్కొంది. త్వరలోనే సంబంధిత అనుమతులు పొందుతామని విశ్వాసం వ్యక్తం చేసింది.

# రైతులకు ద్రోహం చేసిన కేంద్రం

- సంయుక్త కిసాన్‌మోర్చా ధర్నాలో వక్తలు
- రాజ్‌భవన్‌కు బయలుదేరిన రైతులను అడ్డుకున్న పోలీసులు

ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్రం మోసం చేసిందని సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజ్యాంగ దినోత్సవం రోజున సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యాన విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వినతిపత్రం తీసుకునేందుకు రాజ్‌భవన్‌ను నుంచి అనుమతి రాకపోవడంతో రైతు సంఘాల నాయకులు ప్రదర్శనగా బయలుదేరారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఐదుగురికి అనుమతివ్వడంతో నాయకులు వెళ్లి గవర్నర్ కార్యదర్శి సిసోడియాకు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు నిరసన కార్యక్రమం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళన సందర్భంగా వారికి ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా కేంద్రం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని వివరించారు. జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోతే రైతులకు న్యాయం జరగదని తెలిపారు. కేంద్రం రైతులను అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకుంటుందని వివరించారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరితే ఇవ్వని కేంద్రం, ఆదానీలు అడిగినంత ధరలకు అనుమతి ఇచ్చేస్తోందని, ఇంతకంటే న్యాయం మరొకటి లేదని అన్నారు. రైతులకు ధర పెరగకపోగా అదానీ, అంబానీ ఆస్తులు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయని వివరించారు. దీనిపై ఎంపిలను కలిసి వినతిపత్రం సమర్పించే సమయంలో కచ్చితంగా వారి పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతుల సమస్యల పరిష్కారం ప్రధాన అంశంగా ఉండేలా చూడాలని, లేనిపక్షంలో రైతులెవరూ ఓట్లు వేయబోమని ఖరాఖండిగా చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుల బాధలు పట్టని కేంద్రం మెడలు వంచాలని తెలిపారు. తెలుగు రైతు అధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతాంగం నిర్వహించే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రైతు సంఘం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ లిఖిత పూర్వక హామీనిచ్చి ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్రం గత ఏడాది కాలంలో రైతులకు అన్యాయం చేస్తూ ఉద్ధరిస్తున్నామని అబద్దాలు ప్రచారం చేస్తోందన్నారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు నాయకులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, ఎం.వెంకటరెడ్డి, లలితకుమారి, మరీదు ప్రసాదు, రంగారెడ్డి, ఎం.ఉమామహేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై కోపంతో చిన్నారిని గోడకేసి బాదిన తండ్రి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి)

భార్య తనను ధిక్కరిస్తోందన్న కోపంతో పసికందును గోడకోసి కొట్టడంతో ఆ చిన్నారి మరణించింది. ఈ ఘటన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం వాటర్‌వర్క్స్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... వేడాంమిట్ట కండ్రిగ గ్రామానికి చెందిన అనిల్, స్వాతి ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి మూడు నెలల బాబు అఖిల్ ఉన్నాడు. బాబు గుక్కపట్టి ఏడుస్తుండటంతో ఆస్పత్రికి తీసుకువెళ్దామని భార్యతో అనిల్ చెప్పాడు. భార్యభర్తల మధ్య వివాదం నెలకొంది. దీంతో చిన్నారిని అనిల్ గోడకేసి కొట్టడంతో మరణించాడు.

## రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - తణుకు (పశ్చిమగోదావరి)

రైలు ఢీకొని ఇద్దరు గుర్తుతెలీని వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని ఉన్న రైల్వే ట్రాక్‌పై రెండు మృతదేహాలను స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భీమవరంవైపు లేదా నిడదవోలువైపు వెళ్లే రైలు ఢీకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మృతుల వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండొచ్చని తెలిపారు. వారి వద్ద నుంచి ఎలాంటి ఆధారాలూ లభించకపోవడంతో వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

# కులవివక్షపై చర్యలు తీసుకోవాలి

- మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి
- 'ప్రజాశక్తి'తో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కుల వివక్షపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్న కెవిపిఎస్ రాష్ట్ర నాలుగవ మహాసభ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు...

**ప్రశ్న : రాష్ట్రంలో ఎక్కడెక్కడ కుల వివక్ష ఉంది?**

**జవాబు :** రాష్ట్రంలో కుల వివక్ష దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. పశ్చిమ రాయలసీమ ప్రాంతంలో తీవ్రంగా కనిపిస్తోంది. కోస్తా ప్రాంతంలో పాలిష్డ్‌గా ఉంది. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో దళితులను గుడిలోకి రానివ్వడం లేదు. రచ్చబండలపై కూర్చోనివ్వడం లేదు. భోజనాలకు పిలవడం లేదు. మీ రిజర్వేషన్ల వల్లే మా పిల్లలకు ఉద్యోగాలు రావడం లేదంటూ వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. కొన్ని చోట్ల దళితులకు క్షవరం చేయడం లేదు. వినాయక ఉత్సవాలకూ దూరంగా ఉంచుతున్నారు. దళితులు అయ్యప్ప, భవానీ వంటి మాలను వేసినా గుడిలోకి పూజలకు రానివ్వడం లేదు.

**ప్రశ్న : వివక్ష నిర్మూలనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలి?**

**జవాబు :** కుల వివక్ష నిర్మూలనకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి. కుల వివక్ష పాటిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించాలి. చట్టాలను ప్రతిష్టంగా అమలు చేసేందుకు ప్రతి నెలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి. సమీక్షలు చేయాలి. తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

**ప్రశ్న : కెవిపిఎస్ ఎప్పుడు ఆవిర్భవించింది? ఎలా పని చేస్తోంది?**

**జవాబు :** కెవిపిఎస్ 1998 అక్టోబరు 2న ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన పోరాట లక్ష్యాలుగా ఏర్పాటైంది. పూలే, అంబేద్కర్, పెరియార్, నారాయణగురు, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయుల స్ఫూర్తితో పని చేస్తోంది. కుల వివక్షపై, దళితులపై జరుగుతున్న దుర్మార్గమైన కుల దురహంకారాలపై పని చేస్తోంది. ఎక్కడ దాడి జరిగితే అక్కడ పర్యటించి సమగ్రంగా పరిశీలన చేసి దళితులకు న్యాయం కోసం పోరాడుతోంది. దళితుల రక్షణ కోసం నిలబడుతోంది. చైతన్యంతో ఐక్యం చేస్తోంది.

**ప్రశ్న : కెవిపిఎస్‌గా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించారు?**

**జవాబు :** దళితులపై వివక్ష, దాడులపై అనేక కార్యక్రమాలు నిర్వహించాం. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అనుగొండ, ఆదోని మండలం సంతేకుడ్లూరులో ప్రతిఘటన కార్యక్రమాలు నిర్వహించి దళితులను ఆలయ ప్రవేశం చేయించాం. క్షవరం చేయించాం. వివక్ష, దాడులపై తీవ్ర ఆందోళనలు చేపట్టాం.

**ప్రశ్న : రాబోయే కాలంలో ఎలా ముందుకు సాగనున్నారు?**

**జవాబు :** రాబోయే కాలంలో మారుతున్న కుల వివక్షపై సమగ్రంగా సర్వే చేస్తాం. వచ్చిన రూపాలపై దళితులను సమీకరించి చైతన్యం చేసి ఐక్య పోరాటాలు నిర్వహిస్తాం. ప్రభుత్వానికి నివేదించి వారి సహకారంతో ప్రత్యక్ష ప్రతి ఘటనా పోరాటాలు చేస్తాం. శ్మశాన వాటికల సమస్య పరిష్కారం కోసం, ప్రభుత్వం జిఒ 1235 అమలు కోసం చైతన్య యాత్రలు చేసి కాపాడుకుంటాం. అవసరమైతే శ్మశాన స్థలాలు ఆక్రమించిన వారి నుండి విడిపించుకుంటాం.

**ప్రశ్న : మహాసభలో వేటిపై చర్చించనున్నారు?**

**జవాబు :** కుల వివక్ష, దాడులు, మహిళ, వ్యవసాయ కార్మికుల సమస్యలపై, డప్పు కళాకారుల సమస్యలపై 15 తీర్మానాలు మహాసభలో చేయనున్నాం. మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.

## సిఎంతో కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో, కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అర్మానే (ఎపి క్యాడర్ ఐఎఎస్) శనివారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య రాష్ట్రానికి చెందిన రక్షణశాఖకు సంబంధించిన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సిఎం హామీ నిచ్చారు. అనంతరం గిరిధర్‌ను సిఎం సన్మానించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు. అనంతరం మచిలీపట్నంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ యూనిట్ పరిశీలనకు గిరిధర్ వెళ్లారు. అక్కడ జరిగిన ఎన్‌సిసి పునిత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మరో ఆరుగురిని విచారించండి

- వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డి సతీమణి విజ్ఞప్తి
- పులివెందుల కోర్టులో వాంగ్మూలం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన దేవిరెడ్డి శంకర్‌రెడ్డి సతీమణి తులసమ్మ శనివారం పులివెందుల కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. వివేకా హత్య కేసులో మరో ఆరుగురు నిందితులు ఉన్నారని, వారినీ విచారించాలని ఈ ఏడాది ఫిబ్రవరి 21న ఆమె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె వాంగ్మూలమిచ్చారు. ఈ సందర్భంగా తులసమ్మ తరపు న్యాయవాది రవీందర్‌రెడ్డి కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. తొమ్మిది నెలల కిందట వైఎస్ వివేకా హత్య కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాష్‌రెడ్డి, కొమ్మా పరమేశ్వరరెడ్డి, నీరుగట్టు ప్రసాద్, బి.టెక్ రవి, రాజేశ్వర్ రెడ్డిని విచారించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. వారిని కూడా విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడైన ఒకరిని అప్రూవర్‌గా మార్చుకుని దేవిరెడ్డి శంకర్‌రెడ్డిని ఇరికించారని ఆరోపించారు. కేసును తప్పు దారిపట్టించేందుకు ఇతరులపై కేసులు పెడుతున్నారన్నారని తెలిపారు. సిబిఐ పరిగణలోకి తీసుకున్న కాల్‌డేటా ఆధారంగా విచారణ చేపట్టాలని కోరారు.

## బిసిల్లో పట్టుకోసం వ్యూహం

- బిసి మంత్రులకు మార్గనిర్దేశం చేసిన సిఎం
- 8న వైసిపి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిసి ఓటు బ్యాంకును టిడిపి వైపు మరలకుండా ఉండేందుకు వైసిపి వ్యూహరచన చేస్తోంది. గత ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడంలో బిసిలే కీలక పాత్ర పోషించారని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలంగా నమ్ముతుండగా, మరొక వైపు బిసిలే తమకు వెన్నెముకగా టిడిపి ఎన్నికల ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార వైసిపి కూడా బిసిలను తమవైపు తిప్పుకునేందుకు వేగంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బిసి మంత్రులు, ప్రజాప్రతినిధులతో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశానంతరం బిసి మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గుమ్మనూరు జయరాం, బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపి మార్గాని భరత్ మీడియాతో మాట్లాడారు. డిసెంబరు 8న బిసిల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వైసిపి మూడున్నరేళ్ల పాలనలో బిసి వర్గాలకు జరిగిన మేలును గుర్తు చేసుకుంటూ గ్రామ సర్పంచ్‌నుంచి ఎంపిల వరకు బిసిలందరూ కలిసి ఈ సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. బిసి కార్పొరేషన్లు ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో 28 రాష్ట్రాలుంటే బిసిల రాష్ట్ర మంటే ఎపి అని అందరూ చెబుతున్నారన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో బిసిల స్థితిగతులను గుర్తించి వారి జీవన ప్రమాణాలపై ఒక కమిటీ వేసి అధ్యయనం చేయించారన్నారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం రూ.1.76 కోట్లు డిబిటి ద్వారా ప్రజలకు అందిస్తే అందులో 50 శాతానికి పైగా అంటే రూ.86 వేలకోట్లు బిసిలకు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయన్నారు. జనాభా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు మెంబరు బిల్లు పెట్టిన పార్టీ వైసిపి అని మార్గాని భరత్ అన్నారు. ఈ సమావేశంలో బిసి మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, జోగి రమేష్, ఎంపి మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు కె.పార్థసారథి, అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

**వైసిపి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం**

అనంతరం బిసి మంత్రులందరూ వైసిపి కేంద్ర కార్యాలయానికి చేరుకుని రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# తీరానికి తూట్లు

- అలల ఉధృతికి కాకినాడ - ఉప్పాడ బీచ్ రోడ్డు ఛిద్రం
- ధ్వంసం అవుతున్న 'జియో ట్యూబ్'
- సముద్రంలో కలిసిపోతున్న గృహాలు

కెరటాల ఉధృతికి దెబ్బతిన్న కాకినాడ - ఉప్పాడ బీచ్ రోడ్డు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

తుపానులు, అల్పపీడనాల సమయంలో అలల ఉధృతితో సముద్ర తీరానికి తూట్లు పడుతోంది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. కోతతో పలు గృహాలు సముద్రంలో కలుస్తున్నాయి. తీరాన్ని కాపాడేందుకు రాష్ట్రంలోనే మొదటిసారిగా అము చేసిన జియోట్యూబ్ టెక్నాలజీ అలల తాకిడికి పూర్తిగా దెబ్బతింది. దీంతో, ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో తీరప్రాంత ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని తల్లడిల్లుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరం క్రమంగా కనుమరుగవుతోంది. గతంలో పేతాయ్, తిత్లీ, ఫణి, హెలిన్ వంటి తుపానుల సమయంలో ఉప్పాడ, కోనపాపపేట, సూరాడపేట తదితర గ్రామాల్లో వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. గడిచిన 50 ఏళ్లలో ఇక్కడ తీరం కిలోమీటరుకుపైగా ముందుకు చొచ్చుకొచ్చింది. ఫలితంగా 1,500 వరకూ ఇళ్లు, పలు దేవాలయాలు, ప్రభుత్వ భవనాలు సైతం సముద్రంలో కలిసిపోయాయి. 500 ఎకరాల పైబడి వ్యవసాయ భూమి కనుమరుగైందని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

**తునాతునకలైన 'జియోట్యూబ్'**

18 సంవత్సరాల క్రితం 2004 డిసెంబర్‌లో వచ్చిన సునామీ కారణంగా ఈ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తీరప్రాంతం కోతకు గురికాకుండా ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి బర్మా కాలనీ వరకూ 200 మీటర్ల పొడవున 2005 మార్చిలో కోటి రూపాయలతో ఆర్ అండ్ బి అధికారులు పెద్ద పెద్ద బండరాళ్లను వేశారు. అయినా, సముద్రపు కోతను నివారించలేకపోయారు. ఈ నేపథ్యంలోనే అప్పటి కేంద్రం మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు హయాంలో రూ.14 కోట్లతో 1.53 కిలోమీటర్ల పొడవున 2007లో జియోట్యూబ్‌ను నిర్మించారు. దీంతో, తీర ప్రాంతం కోతను కొంతకాలం పాటు నివారించగలిగారు. ఖైముక్, నీలం తుపానుల సమయంలో జియోట్యూబ్ ఈ తీరాన్ని కోత నుంచి కాపాడింది. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో ప్రస్తుతం ఇది ధ్వంసమైంది.

**బీచ్ రోడ్డుకు రక్షణ కరువు**

**కాకినాడ నుంచి ఉప్పాడ వరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవునా బీచ్ రోడ్డు ఉంది.** మాయాపట్నం నుంచి కాకినాడ వైపు బీచ్ రోడ్డు గుండా సుమారు ఒక కిలోమీటరు పొడవున సముద్రకోత నివారణకు బండరాళ్లు, రెండు వేల సిమెంటు దిమ్మలు డంప్ చేశారు. అయినా, సముద్ర కోతను అడ్డుకోలేకపోయారు. దీంతో, చిన్నపాటి కెరటాలకే ఉప్పాడ - కాకినాడ బీచ్‌రోడ్డు ఛిద్రమవుతోంది. మరమ్మతులకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా ప్రయోజనం ఉండడం లేదు. ఉప్పాడ తీరమంటే కాంట్రాక్టర్లకు కాసుల పంటగా మారిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నిమార్లు మొరపెట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారానికి పట్టించుకోవట్లేదని మత్స్యకారులు, తీర ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**భయం భయంగా జీవిస్తున్నాం**

ఐదేళ్ల కాలంలో సముద్రపు కోత తీవ్రంగా ఉంది. తుపానులు వచ్చినప్పుడల్లా తీర ప్రాంతంలో ఉన్న ఇళ్లు సముద్రంలో కలిసిపోతున్నాయి. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయం భయంగా జీవించాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా తీరప్రాంత రక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి.

**- గంట అప్పారావు, మత్స్యకారుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం**

**శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు**

తీర ప్రాంత రక్షణకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా సుమారు రూ.34 కోట్లతో రక్షణ చర్యలు తీసుకునే విధంగా ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్నాయి. అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీరప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

**- వంగా గీత, కాకినాడ ఎంపి**

## డాష్‌బోర్డ్ మాయం ?

**జిఓల సైట్ తరహాలోనే ..**

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వ సమాచార వ్యవస్థలో మరో కీలకమైన కోర్ డాష్‌బోర్డ్ కూడా మాయమైపోతోంది. దాదాపు 40 శాఖలకు పైగా ఈ డాష్‌బోర్డ్‌లో తమతమ శాఖల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తాయి. ఇవి ప్రజలకు కూడా ఎంతో అందుబాటులో ఉంటాయి. చాలాకాలంగా ఎటువంటి దాపరికం లేకుండా ఈ డాష్‌బోర్డ్‌లో సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. అయితే కొద్ది నెలలుగా ఈ డాష్‌బోర్డ్ నిర్వీర్యమైపోతోంది. శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఈ సైట్‌లో పొందుపరడం లేదు. ఇది మరో ప్రభుత్వ ఉత్తర్వుల సైట్‌గా అంతరించిపోతోందని తెలుస్తోంది. పుడో దశాబ్దాల కాలం కితమే అన్ని శాఖల సమాచారాన్ని ఒకే చోట నిక్షిప్తం చేసేందుకుగాను కోర్ డాష్‌బోర్డ్‌ను రూపొందించారు. ప్రతి శాఖకు సంబంధించిన పథకాలు, వాటి అమలు, అందుకు సంబంధించిన గణాంకాలను కూడా ఏ రోజుకారోజు సైట్‌లో పొందుపరిచేవారు. పలు సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు కూడా ఇక్కడే కనిపించేవి. కొద్దిరోజులుగా దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంటోంది. కారణాలేమిటో స్పష్టంగా తెలియనప్పటికీ ఈ సైట్‌ను వినియోగించేందుకు ప్రభుత్వం ఇష్టపడడం లేదని అంటున్నారు. ఒకటి రెండు సైట్లు మాత్రం నేరుగా ఆయా శాఖల ప్రధాన సైట్లకు మళ్లేలా చూస్తున్నారు .కొన్ని సైట్లలో అప్‌డేట్ జరిగి రెండేళ్లకు పైగానే అయినట్లు చూపిస్తోంది. కొద్ది నెలల క్రితమే కీలక వెబ్‌సైట్ అయిన జీఓఐఆర్ (ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసే సైట్)ను కూడా ప్రభుత్వం మూసివేసింది. తరువాత దీనిపై వివాదం నెలకొనడం, కోర్టుకు కొంతమంది వెళ్లడంతో గెజిట్ సైట్ ద్వారా ఒకటీ అరా ఉత్తర్వులు పెడుతున్నారు. అయితే జీఓఐఆర్‌ను మాత్రం ఇప్పటివరకు పునరుద్ధరించలేదు. ఇప్పుడు డాష్‌బోర్డ్ కూడా ఇదే తరహాలో కనుమరుగు అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## భారత్‌లో మరో వ్యాపారానికి అమెజాన్ గుడ్‌బై

- నిలిచిపోనున్న ఫుడ్ డెలివరీ సేవలు

**న్యూఢిల్లీ :** భారత్‌లోని మరో వ్యాపారాన్ని రద్దు చేసుకుంటున్నట్లు బహుళ జాతి సంస్థ అమెజాన్ ప్రకటించింది. ఇటీవల అమెజాన్ అకాడమీని మూసివేస్తున్నట్లు ప్రకటించగా.. తాజాగా దేశంలోని ఫుడ్ డెలివరీ వ్యాపార విభాగం అయినా 'అమెజాన్ ఫుడ్' కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు అమెజాన్ ఇండియా శనివారం ప్రకటించింది. డిసెంబర్ 29 నుంచి ఈ సేవలను పూర్తిగా మూసి వేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఈ వ్యాపారాన్ని దశల వారిగా ఉపసంహరించుకుంటున్నట్లు స్పష్టం చేసింది. ఫుడ్ డెలివరీ యాప్స్ స్విగ్గీ, జొమాటా తరహాలో లాభాలను రాబట్టలేక పోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

కంపెనీ వార్షిక కార్యకలాపాల ప్రణాళిక సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ కంపెనీ వెల్లడించింది. భారత్‌లో 20 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.5 లక్షల కోట్లు) పెట్టుబడులతో భారత్‌లో అమెజాన్ ఫుడ్ సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నట్లు 2020 మేలో ఆ కంపెనీ ప్రకటించింది. తొలుత బెంగళూరు కేంద్రంగా ఈ సేవలను ప్రారంభించింది. భారత్‌లోని అమెజాన్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంను మూసివేస్తున్నామని అమెజాన్ గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఎలాంటి కారణం చూపకుండానే ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా 10వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు అమెజాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్‌లోనూ పొదుపు చర్యల నేపథ్యంలో పలు వ్యాపారాల మూత, ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేసింది.

## స్మార్ట్ ఫోన్ల రంగంలోకి ఎలన్ మస్క్..!

**వాషింగ్టన్ :** టెస్లా అధినేత ఎలన్ మస్క్ ట్విట్టర్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి రోజూ ఏదో ఒక వార్తలో నిలుస్తున్నారు. అవసరమైతే స్మార్ట్‌ఫోన్ రంగంలోకి ప్రవేశిస్తామని తాజాగా పేర్కొన్నారు. టెక్ దిగ్గజాలు ఆపిల్, గూగుల్ సంస్థలు తన ట్విట్టర్ యాప్‌ను యాప్ స్టోర్ నుంచి తొలగిస్తే... తానే స్మార్ట్ ఫోన్ రంగంలోకి ప్రవేశిస్తామని ప్రకటించారు. కంటెంట్ నియంత్రణ సమస్యలపై ఆపిల్, గూగుల్ యాప్ స్టోర్ ట్విటర్‌ను నిషేధించే అవకాశం ఉందన్న రిపోర్టుల నేపథ్యంలో మస్క్ ఓ ట్వీట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు.

## యూనియన్ 'మల్టీక్యాప్ ఫండ్' ఆవిష్కరణ

**ముంబయి :** యూనియన్ మల్టీ క్యాప్ ఫండ్‌ను విడుదల చేస్తున్నట్లు యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఎఎంసి) వెల్లడించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకమని పేర్కొంది. ఇందులో వచ్చిన నిధులను మార్కెట్ క్యాపిటలైజేషన్ వ్యాప్తంగా క్రమశిక్షణతో ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా క్యాపిటల్ వద్ధి చేయడం లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. మిడ్, స్మాల్ క్యాప్స్ అందించే అత్యధిక వద్ధి సామర్థ్యంతో ఈ స్కీమ్ ప్రయోజనం పొందుతుదని పేర్కొంది. ఈ ఫండ్ నవంబర్ 28న తెరుబడుతుందని.. డిసెంబర్ 12 మూసివేయబడుతుందని తెలిపింది.

## ఓయోకు రూ.333 కోట్ల నష్టాలు

**ముంబయి :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ ప్రయివేటు లిమిటెడ్ రూ.333 కోట్ల నష్టాలను ప్రకటించింది. ఇంతక్రితం త్రైమాసికంలో ఈ సంస్థ రూ.414 కోట్ల నష్టాలు నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో సంస్థ రెవెన్యూ 24 శాతం పెరిగి రూ.2,905 కోట్లుగా నమోదయ్యిందని తెలిపింది. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ కోసం గతేడాది అక్టోబర్‌లో ఈ సంస్థ సెబీకి దరఖాస్తు చేసుకుంది. వరుస నష్టాలను చవి చూస్తున్న ఈ సంస్థ ఐపిఒకు వస్తే ఏ మేరకు స్టాక్ మార్కెట్లలో రాణిస్తోందో వేచి చూడాలి.


**సెంట్రల్ రైల్వే**

**రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్**

సిపిఎం కన్వర్షన్ ఆఫీస్ బిల్డింగ్, పి.డిమెల్లో రోడ్, వాడీ బందర్, ముంబయి 400010

**ఇండికేటివ్ నోటిఫికేషన్**

ఎంప్లాయ్‌మెంట్ నోటీసు నెం. RRC/CR/02/2022 తేదీ 26/11/2022

| | |
|---|---|
| స్లాట్ ప్రారంభ తేదీ, సమయం | 28/11/2022 ఉ.10 గంటలు |
| స్లాట్ ముగింపు తేదీ, సమయం | 12/12/2022 సా. 6 గంటలు |

2022-23 సంవత్సరానికి వివిధ డిసిప్లిన్‌ల కింద వున్న స్పోర్ట్స్ కోటాలో 21 పోస్టుల భర్తీకి అర్హులైన క్రీడాకారులనుండి సెంట్రల్ రైల్వే ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

| క్ర.సం. | లెవల్ | 7వ సిపిసి ప్రకారం | పోస్టుల సంఖ్య |
|---|---|---|---|
| 01 | 5/4 (Group C) | (29200-92300) / (25500-81100) | 03 |
| 02 | 3/2 (Group C) | (21700-69100) / (19900-63200) | 18 |

➤ వివరణాత్మకమైన నోటిఫికేషన్ కోసం దయచేసి 26/11/2022 నుండి అందుబాటులో వుండే RRR/CR కు చెందిన www.rrccr.com వెబ్ సైట్‌ను సందర్శించండి

ఛైర్మన్ RRR/CR

రైల్ మదద్ హెల్ప్‌లైన్ 139

600

సంపాదకీయం

# కంప్యూటర్ అక్షరాస్యత

'అక్షరంబు తల్లి యఖిలవిద్యల కెన్న/ నక్షరంబు లోకరక్షకంబు/ అక్షరంబులేని యబలున కెందును/ భిక్ష పుట్టబోదు పృథ్విలోన' అని ఒక చాటువు చెబుతుంది. జీవన వికాసానికి, పరిపూర్ణతకు అక్షరం ఓ గీటురాయి. అక్షరాస్యత మానవ ప్రగతికి దిక్సూచి. 'మనిషి జీవించడానికి ఆహారం ఎంత అవసరమో... మానవ ప్రగతికి చదువు కూడా అంతే అవసరమ'ని యునెస్కో నిర్వచించింది. ఏ దేశమైనా, రాష్ట్రమైనా ప్రగతిపథంలో ఉందంటే అక్కడి అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన అంశాలలో ప్రధానమైనది అక్షరాస్యత. 'ఒక సంస్కృతిని నాశనం చేయడానికి పుస్తకాలను కాల్చే పనిలేదు...జనాన్ని చదవకుండా చూడండి చాలు' అంటాడు అమెరికన్ రచయిత రే బ్రాడ్బరీ. ఏ దేశాభివృద్ధి అయినా ఆ దేశ ప్రజల అక్షరాస్యతపైనే ఆధారపడి ఉంటుంది. కానీ ఇప్పుడంతా టెక్నాలజీ కాలం. రోజువారీ జీవితంలో డిజిటల్ అవసరాలు కూడా కలగలిసిపోయాయి. కంప్యూటర్లు మానవ జీవితంలో ముఖ్యమైన భాగమయ్యాయి. ఈ క్రమంలోనే 'కంప్యూటర్ అక్షరాస్యత' అవసరం పెరిగింది.

ప్రపంచవ్యాప్తంగా బాలబాలికలు, మహిళలలో డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడానికి డిసెంబర్ 2వ తేదీని 'కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం'గా పాటిస్తున్నారు. ప్రపంచం డిజిటల్ భవిష్యత్తు వైపు కదులుతున్నప్పటికీ, సమాజంలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికీ కంప్యూటర్లు, ఇంటర్నెట్‌కు దూరంగానే ఉన్నాయి. చైనా, జపాన్ వంటి దేశాలు 6జి వైపు అడుగులు వేస్తోంటే, మనం ఇంకా 4జీ తోనే కుస్తీ పడుతున్నాం. నేటికీ కోట్లాది మంది ప్రజలకు కనీసం వారి పేరు చదివే, రాసుకోగలిగే చదువు కూడా లేదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. కానీ సాంకేతిక విజ్ఞానం దూసుకుపోతూనే వుంది. ఇప్పుడు సాంకేతికత తాకని రంగమంటూ లేదు. రోజువారీ పనులు కూడా ఈ సాంకేతికతతో ముడిపడిపోయాయి. చదువులు, ఉద్యోగాల్లోనూ మార్పులొచ్చాయి. కంప్యూటర్ అక్షరాస్యత అంతా ఇంటర్నెట్ చుట్టూనే తిరుగుతోంది. ఇదొక సమాచార సంద్రం. ఇందులో నిజాలు, అబద్ధాలు, అపోహలు... అన్నీ ఉంటాయి. ఏది నమ్మాలి, ఏది నమ్మకూడదు అనే విచక్షణకు కంప్యూటర్ అక్షరాస్యత చాలా ముఖ్యం. దీనిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారు. అవసరంలేని విషయాలను సెర్చ్ చేయడం, అనవసరమైన లింక్‌లపై క్లిక్ చేయడం వంటివి డిజిటల్ ప్రమాదాలకు తావిస్తున్నాయి. ఈ ప్రమాదాల నుంచి బయట పడాలంటే...చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ అక్షరాస్యత అవసరం. విద్యార్థులు, ఉద్యోగార్థులకైతే కంప్యూటర్ విద్య తప్పనిసరి. '2025 చివరికి ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలు మనుషుల నుంచి యంత్రాల చేతుల్లోకి వెళ్లనున్నాయి. అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకురానున్నాయి' అని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ అంచనా. దీనికి డిజిటల్ నైపుణ్యం అవసరం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

అయితే, ప్రాథమిక అవసరంగా మారిన కంప్యూటర్ విద్యను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుంది. స్కూళ్లు, కాలేజీల కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు ప్రభుత్వ ఆఫీసులన్నీ మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్... విండోస్‌తోనే నిండిపోయి వున్నాయి. సాధారణ ప్రజలకు, పేద విద్యార్థులకు ఈ సాఫ్ట్‌వేర్లు అందని ద్రాక్షయే. అంతేకాదు...ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ వినియోగదారులలో పురుషులే ఎక్కువని, మహిళలు, పిల్లలు చాలా తక్కువ సంఖ్యలో వున్నారని ఒక సర్వే వెల్లడించింది. భారత్‌లో 53.9 శాతం మహిళలకు మొబైల్ ఫోన్లు ఉన్నప్పటికీ... డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నవారు 22.2 శాతం మాత్రమేనని దేశవ్యాప్తంగా చేపట్టిన పలు సర్వేలు చెబుతున్నాయి. దాదాపు 135 కోట్ల మంది జనాభా వున్న భారత్‌లో ప్రస్తుతం 64.6 కోట్ల మంది మాత్రమే ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు. కంప్యూటర్లను, ఇంటర్నెట్‌ను ఉపయోగించుకోవాలంటే... ప్రతి ఒక్కరికీ ప్రాథమిక విద్య, డిజిటల్ అక్షరాస్యత అవసరం. లినక్స్ వంటి ఉచిత ఆపరేటింగ్ సిస్టమ్‌లు, ఉచిత సాఫ్ట్‌వేర్‌లను ప్రభుత్వాలు ప్రోత్సహించడం లేదు. వీటిని ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ, కాలేజీల్లోనూ ప్రవేశపెట్టడం ద్వారా పాఠశాల స్థాయి నుంచే తక్కువ ఖర్చుతో కంప్యూటర్ విద్యను అందించే అవకాశం వుంది. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.



ఫ్రెడరిక్ ఏంగెల్స్

జననం : 28.11.1820
మరణం : 5.8.1895

**మనిషి చేతులు, జ్ఞానేంద్రియాలు, వాక్కు వంటివి అభివృద్ధి చెందడం వెనక శ్రమ ఎటువంటి పాత్ర పోషించిందో తెలియజేశాడు. ఇవన్నీ ఏదో ఒక దైవశక్తి సృష్టించినవి కావని, భౌతిక జీవిత క్రమంలోనే అవి రూపొందాయని తేల్చి చెప్పాడు.**

# సిజెఐ చంద్రచూడ్ - న్యాయ వ్యవస్థ పరిణామాలు

ప్రస్తుతం



తెలకపల్లి రవి

భారత ప్రధాన న్యాయమూర్తిగా డి.వై. చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశాక సుప్రీంకోర్టులో ఇటీవల కొన్ని నూతన పరిణామాలు చూస్తున్నాం. కొలీజియం సిఫార్సులు, కీలక, కేసుల పోస్టింగు రిజిస్ట్రేషన్, బదిలీలు, కేంద్ర న్యాయశాఖ స్పందనలు, కొన్ని రాజ్యాంగ కేసుల విచారణ వంటి అన్ని విషయాల్లోనూ కొత్త వాతావరణం కనిపిస్తున్నది. దేశ చరిత్రలోనే అత్యధికంగా ఏడున్నరేళ్లు సిజెఐగా పనిచేసిన వై.వి.చంద్రచూడ్ కుమారుడైన ప్రస్తుత సిజెఐ రెండేళ్లపైన పదవిలో కొనసాగనుండటం గత పదేళ్లలో ఇదే ప్రథమం. అనేక సందర్భాల్లో స్వతంత్ర విమర్శనాత్మక వైఖరి ప్రదర్శించి సంచలన తీర్పులు ఇచ్చిన సిజెఐ చంద్రచూడ్ పదవీ కాలంపై ముందే చాలామందిలో ఆశావిశ్వాసాలు వ్యక్తమైనాయి. ఎందుకంటే గత కొన్ని సంవత్సరాలుగా మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ హయాంలో న్యాయ వ్యవస్థ కేంద్రానికి విధేయంగానూ, అనుకూల రీతిలోనూ వ్యవహరిస్తున్నదనే అభిప్రాయం బలపడింది. అందుకు అనేక ఆధారాలూ వున్నాయి. ప్రజల మౌలిక హక్కులకూ లౌకిక తత్వానికీ సంబంధించిన కేసులు వెనక్కుపోవడం, దేశద్రోహం రాజద్రోహం వంటి పేర్లతో అనేక మంది అభ్యుదయవాదులను దారుణమైన శిక్షలకు గురిచేయడం, పౌరసత్వ సవరణ చట్టం, జమ్ము-కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేకానేక మౌలికమైన అంశాలు ఏళ్లతరబడి విచారణకు నోచుకోవడం లేదు గాని ప్రార్థనా స్థలాల వివాదాలు మాత్రం పదేపదే ముందుకొచ్చాయి. న్యాయమూర్తుల పైన వివాదాలు, ఫిర్యాదులు తీవ్రమైనాయి. అయిదేళ్ల కిందట అప్పటి ప్రధాన న్యాయమూర్తిపైనే సహచర సీనియర్లు ధ్వజమెత్తాల్సి వచ్చింది. హైకోర్టులూ అనేకసార్లు భిన్నాభిప్రాయం వెలిబుచ్చాయి. మరో వంక కేంద్రం ఏకపక్ష జోక్యం, వ్యాఖ్యలు ఒత్తిడి తేవడం కనిపించింది. మాజీ ప్రధాన న్యాయమూర్తిని రాజ్యసభకు పంపడమూ జరిగింది. ఇన్ని పరిణామాల మధ్య సిజెఐగా వచ్చిన జస్టిస్ ఎన్.వి.రమణ అత్యధికంగా జడ్జిల నియామకం చేయడానికి ప్రాధాన్యతనిచ్చారు. పైన చెప్పిన కేసులన్నీ అలాగే వదలి పదవీ విరమణ చేయగా జస్టిస్ యు.యు.లలిత్ ఇంచుమించు రెండు మాసాల పాటు ఆ స్థానంలోకి వచ్చారు. ఆయన సుప్రీంలో కేసులు వేగంగా పరిష్కరిస్తానంటూ పెద్దఎత్తున ధర్మాసనాలకు కేటాయిస్తూ వచ్చారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల వంటి ఒకటి రెండు కేసులు మాత్రం పరిష్కారం చేసి దిగిపోయారు. ఆ సందర్భంగా తాను రాజ్యసభ పదవి వంటివి తీసుకోను గాని పార్లమెంటు ఆమోదించే ట్రైబ్యునళ్ల వంటి వాటిని తీసుకోవడానికి అభ్యంతరం లేదని ప్రకటించారు. ప్రొఫెసర్ సాయిబాబా విడుదలకు హైకోర్టు తీర్పు చెబితే సుప్రీం కోర్టు ఆలస్యం

**ఇలాంటి నేపథ్యంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవలేదు. తన హయాంలో మరే సిజెఐ విషయంలోనూ మోడీ హాజరుకాకపోవడం జరగలేదు. ఇది పొరబాటనీ, ఆయన విముఖతకు నిదర్శనమనీ వ్యాఖ్యలు వచ్చాయి. కొంతమంది ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యాతలు రెండేళ్ల పాటు వుండబోయే సిజెఐ చంద్రచూడ్ తీరును కనిపెట్టి వుండాలని రాయడం గమనించదగింది. న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈ తరుణంలోనే కొలీజియం వ్యవస్థపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణయాధికారం ప్రభుత్వానిదే గాని న్యాయస్థానాలది కాదని చెబుతూ వచ్చారు.**

చేసిన తీరుకు తన బాధ్యత లేదని సమర్థించుకున్నారు.

**చంద్రచూడ్ తొలి చర్యలు**

సిజెఐగా చంద్రచూడ్‌పై ఆశలుండటానికి కారణముంది. ఆయన ఇచ్చిన తీర్పులు అలాంటివి. 377 అధికరణం స్వలింగ సంపర్కుల కేసు, వివాహేతర సంబంధాలలో మహిళల పట్ల వివక్షత, బాలికలను దత్తత తీసుకోవడం, శబరిమలలో మహిళల ప్రవేశం, అవివాహితల గర్భస్రావ హక్కు, అత్యాచారం కేసుల్లో రెండు వేళ్లతో పరీక్ష రద్దు వంటి అనేక సంచలన తీర్పులు హైకోర్టులోనూ సుప్రీంక కోర్టు లోనూ కూడా వెలువరించారు. ప్రాథమిక హక్కుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ విషయాల్లో ముందున్నారు. గుజరాత్ మారణకాండపై తీసిన చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ నిలిపివేతను కొట్టివేశారు. ఆదాయపన్ను శాఖపై వోడా ఫోన్ ఫిర్యాదును తోసిపుచ్చారు. మతతత్వ పూరితంగా ఓట్లు అడగడానికి, నిజమైన సమస్యలు చెప్పడానికి తేడా వుందని ఒక తీర్పులో స్పష్టంచేశారు. గోప్యత హక్కును సమర్థించే తీర్పునిచ్చారు. ఢిల్లీ పాలన ముఖ్యమంత్రిదే తప్ప లెఫ్టినెంట్ గవర్నర్‌ది కాదని స్పష్టంగా తీర్పునిచ్చారు. ఆధార్ చట్టం చెల్లుబాటును మెజార్టీ తీర్పు ఆమోదిస్తే అది సరైన రీతిలో రాజ్యాంగ బద్ధంగా ఆమోదించలేని జస్టిస్ చంద్రచూడ్ ఒక్కరే మైనార్టీ తీర్పునిచ్చారు. సైన్యంలోనూ మహిళా అధికారుల పట్ల వివక్ష చెల్లదన్నారు. ఇలాంటివి ఇంకా చాలా వున్నాయి.

> **మొత్తంపైన గత కొద్ది సంవత్సరాలుగా సుప్రీం కోర్టు ధోరణిలో కొంతైనా మార్పు కనిపించడం, స్వతంత్రత అవసరాన్ని నొక్కి చెప్పడం స్వాగతించదగింది. దీనిపై కేంద్రం స్పందనలూ సుప్రీం తదుపరి అడుగులూ కూడా జాగ్రత్తగా చూడాల్సి వుంటుంది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలపైనా సమాఖ్యతత్వం, లౌకిక తత్వం, భావప్రకటనా స్వేచ్ఛ వంటి వాటిపైనా తీవ్ర దాడి చేస్తున్న సమయంలో వాటి రక్షణకు సుప్రీంకోర్టు కీలక పాత్ర వహించాలని ప్రజలు ఆశిస్తున్నారు.**

ఇలాంటి నేపథ్యంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవలేదు. తన హయాంలో మరే సిజెఐ విషయంలోనూ మోడీ హాజరుకాకపోవడం జరగలేదు. ఇది పొరబాటనీ, ఆయన విముఖతకు నిదర్శనమనీ వ్యాఖ్యలు వచ్చాయి. కొంతమంది ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యాతలు రెండేళ్ల పాటు వుండబోయే సిజెఐ చంద్రచూడ్ తీరును కనిపెట్టి వుండాలని రాయడం గమనించదగింది. న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు ఈ తరుణంలోనే కొలీజియం వ్యవస్థపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణయాధికారం ప్రభుత్వానిదే గాని న్యాయస్థానాలది కాదని చెబుతూ వచ్చారు. కొన్ని సంవత్సరాల తర్వాత న్యాయ కమిషన్‌ను పునర్నిర్మించారు.

సంప్రదాయికంగా ప్రమాణ స్వీకారానికి ముందు సిజెఐ ఇచ్చిన ఇంటర్వ్యూలలో సామాన్యునికి న్యాయం అందించడం మొదటి ప్రాధాన్యత అన్నారు. జస్టిస్ రమణ హయాంలో జడ్జిలపై విమర్శలను, ఆరోపణలను గట్టిగా ఖండిస్తూ వచ్చారు. గాజు ఇళ్లలో వలె భద్రత లేకుండా పోయిందన్నారు. ఇందుకు భిన్నంగా సిజెఐ చంద్రచూడ్ న్యాయమూర్తులు కూడా సోషల్ మీడియా విస్తరణను న్యాయమూర్తులు కూడా గుర్తించాలని విమర్శలకు సిద్ధం కావాలని సూచించారు. కొలీజియం వ్యవస్థ పరిస్థితిని బట్టి వచ్చిందే తప్ప ఉద్దేశపూర్వకమైంది కాదన్నారు. జడ్జిల నియామకం సమయంలో చాలా విషయాలు పరిశీలించాలంటే అందుకు ఒక వేదిక తప్పదనీ, అయితే నియామకాలు మాత్రం పారదర్శకంగా వుండాలని స్పష్టం చేశారు. న్యాయమూర్తులు వ్యక్తిగతంగా తీర్పరుల్లా జడ్జిమెంటల్‌గా వ్యవహరించరాదనీ, వాస్తవాలనుబట్టి నిర్ణయించాలని స్పష్టంచేశారు. జడ్జిల నియామకం పారదర్శకంగా వుండాలనీ అనేశారు.

బాధ్యతలు చేపట్టిన వెంటనే సిజెఐ చంద్రచూడ్ కేసులను నమోదు చేసి ధర్మాసనాల ముందుకు తెచ్చే విషయంలో పారదర్శకమైన ప్రకటన చేశారు. కేసుల భారం తగ్గించేందుకు అంతకు ముందు జరిగిన దానికి భిన్నంగా అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. దీర్ఘకాలంగా మగ్గిపోతున్న బెయిలు దరఖాస్తులు, కేసుల బదిలీలు మాత్రం భారీ ఎత్తున ప్రతి రోజూ చేపట్టాలని నిర్ణయించారు. తొలి కొలీజియం సమావేశంలోనే ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేశారు. దీనిపై తెలంగాణ, గుజరాత్ హైకోర్టులలో న్యాయవాదలు నిరసన తెలిపితే పిలిపించి చర్చలు చేసి కొన్ని మార్పులు చేశారు. అయినా ఎ.పి హైకోర్టు నుంచి ఇద్దరు న్యాయమూర్తుల బదిలీపై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ గణేశ్‌ల బదిలీ గురించి రాజకీయ పరిభాషలో నిరసన సాగుతున్నది. ఇంతకు ముందు కోర్టులపై వైసిపి వారు ఆరోపణలు చేస్తే ఈ బదిలీలపై టిడిపికి అనుకూలమైన వారు కొందరు శృతిమించిన వ్యాఖ్యలు కూడా చేశారు. తాము సిఫార్సు చేసిన పేర్లను కేంద్రం తొక్కిపట్టడంపై సిజెఐ చంద్రచూడ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. అంతేగాక సుప్రీంకోర్టు వీటి గురించి కేసు విచారణ చేపట్టి కేంద్రానికి నోటీసు కూడా ఇచ్చింది. కీలకమైన ఢిల్లీ, ముంబాయి హైకోర్టుల వంటివి కూడా గతం కన్నా తీవ్రమైన తీర్పులివ్వడం కనిపిస్తున్నది. మాజీ సిజెఐపై ఎ.పి ముఖ్యమంత్రి జగన్ గతంలో ఆరోపణలతో లేఖ రాయడం కూడా విచారణకు రానుంది. రాజధాని కేసులు, వాటిపై నిర్ణయం తీసుకోవడం గురించి రాజ్యాంగాధికారాలు కూడా ఇప్పుడు సుప్రీం ముందున్నాయి.

**సిఇసి నియామకం-ఏకపక్ష వైఖరి**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) నియామకంలో కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖరిని లోపభూయిష్టమైన నియామకాలను జస్టిస్ జోసఫ్ నాయకత్వం లోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ప్రశ్నించిన తీరు ఇటీవలి కాలంలో మనం ఎరుగనిది. రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం సిఇసి ఆరేళ్ల కాలం గాని, 65 ఏళ్ల వయసు వరకూ గాని పదవిలో కొనసాగవచ్చు. కాని ఏరికోరి కేవలం ఏడాదిలోపు రిటైరయ్యే వారినే నియమించడం ద్వారా సిఇసిలు కీలుబొమ్మల్లా మార్చివేయబడుతున్నారు. వారేదైనా కీలకమైన నిర్ణయం తీసుకునే లోపే దిగిపోవలసిన స్థితి. తొలి సిఇసి ఎనిమిదేళ్లు పనిచేశారు. కాని కేంద్రం ఏరికోరి 1950లలో పుట్టిన వారినే ఎంపిక చేస్తున్నదని, వారు తమకు తలూపేలా వుండాలనుకుంటున్నదనీ సుప్రీం వ్యాఖ్యానించింది. యుపిఎ హయాంలో ఆరుగురు, మోడీ ఏడేళ్ల పాలనలో ఎనిమిది మంది సిఇసిలు మారారని గుర్తు చేసింది. రాజ్యాంగం ఈ నియామక ప్రక్రియపై పూర్తి స్పష్టతనివ్వలేదని సిఇసిని ఎంపిక చేసే కమిటీలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా వుంటే మంచిదని సూచించింది.

ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతపై అనేక సందేహాలు ముసురుకుంటు్న వేళ సుప్రీం కోర్టు ఈ అంశాన్ని చేపట్టడం ఆహ్వానించదగింది. ఈ మాత్రం వ్యాఖ్యలు సహించలేని కేంద్ర అటార్నీ జనరల్ వెంకట రమణ మీరు మాట మీరవద్దు అనడం కేంద్రం వైఖరిని చెబుతుంది. న్యాయమూర్తులుంటే తప్పు జరగదని చెప్పలేమని ఆయన చేసిన వ్యాఖ్య అసహనపూరితమైంది. కొలీజియం ఒకటికి రెండు సార్లు చర్చించి న్యాయమూర్తుల పేర్లు సిఫార్సు చేశాక ఏమీ తేల్చకుండా కేంద్రం ఎడతెగని జాప్యం చేయడం సరికాదని కూడా ఇటీవల సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మొత్తంపైన గత కొద్ది సంవత్సరాలుగా సుప్రీం కోర్టు ధోరణిలో కొంతైనా మార్పు కనిపించడం, స్వతంత్రత అవసరాన్ని నొక్కి చెప్పడం స్వాగతించదగింది. దీనిపై కేంద్రం స్పందనలూ సుప్రీం తదుపరి అడుగులూ కూడా జాగ్రత్తగా చూడాల్సి వుంటుంది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలపైనా సమాఖ్యతత్వం, లౌకిక తత్వం, భావప్రకటనా స్వేచ్ఛ వంటి వాటిపైనా తీవ్ర దాడి చేస్తున్న సమయంలో వాటి రక్షణకు సుప్రీంకోర్టు కీలక పాత్ర వహించాలని ప్రజలు ఆశిస్తున్నారు. అప్పుడే అత్యున్నత నాయస్థానంపై కేంద్రం ఒత్తిడి పెరగడం కనిపిస్తూనే వుంది. మరి సిజెఐ చంద్రచూడ్ హయాంలో సుప్రీంకోర్టు కేంద్రం ఒత్తిడిని, దాడులను తట్టుకుని రాజ్యాంగ రక్షణకు తగు వైఖరి తీసుకుంటే దేశానికి, ప్రజాస్వామ్యానికి గొప్ప మేలు జరుగుతుంది. ★

## ఉక్కు జోలికొచ్చావో ఢీ అంటే ఢీ

ఉక్కు జోలికొచ్చావో - ఢీ అంటే ఢీ
నీ ఆటలింక సాగవులే - జగత్ కిలాడీ / 2 /
తాతల తండ్రుల నెత్తురు - మా విశాఖ ఉక్కు
నేతలు, మంత్రులకెక్కడిది అమ్ముకునే హక్కు / 2 /
// ఉక్కు //

సొంత గనులు సమకూర్చని - సిగ్గులేని తనమా
కాలి కింది నేల మీద - వాడి బోడి పెత్తనమా / 2 /
రొమ్ము చరిచి ప్రశ్నించని - తొత్తు మంత్రులెందుకు
కొమ్ము విరిచి నిలదీయని - భజంత్రీలు
మనకెందుకు /2/
// ఉక్కు //

చీమలు పెట్టిన పుట్టలో - పాములు బుసగొట్టుటయా
తేనె తుట్టె కదిపినట్టు - ఉద్యమ సెగ పుట్టదా / 2 /
ఊరూరా చుట్టుముట్టి - ఉచ్చులు బిగబట్టదా
వల్లకాటి వరకు నిన్ను - వెంట తరిమి కొట్టదా / 2 /
// ఉక్కు //

కదం తొక్కుతోంది చూడు - కర్షక, కార్మిక శక్తి
పదం కలుపుతోంది చూడు - కళాజగతి యుక్తి / 2 /
కలము, గళము, హలము - త్రిశూల కొలుముల
మయమై
నాట్య తాండవం ఆడితె - పటాల భస్మీపటలమె / 2 /

**- రాజహంస,**
**సెల్ : 9490263115.**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
editpageps@ gmail.com

సందర్భం

# ఫూలే బోధనలు అనుసరణీయం

నేటికి 170 ఏళ్ల క్రితమే మనుషులందరూ సమానులేనని...దేవుడి బిడ్డల్లో కొందరు అగ్ర వర్ణాల వారు మరికొందరు నిమ్న వర్గాల వారు ఎలా అవుతారని ప్రశ్నించాడు. ఆ రోజుల్లోనే అస్పృశ్యతా నివారణ, మహిళా విముక్తి, విద్యా వ్యాప్తి కోసం కృషి చేసిన సామాజిక ఉద్యమకారుడు జ్యోతిబా ఫూలే.

జ్యోతిరావు గోవిందరావు ఫూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర లోని సతారా జిల్లా ఖట్గున్ గ్రామంలో జన్మించాడు. నాటి పీష్వా రాజుల దగ్గర జ్యోతిరావు కుటుంబం పూలమాలలు కట్టి అమ్మే వృత్తిని కొనసాగించిన కారణంగా ఫూలే అనే పేరు వచ్చింది. వెనుకబడిన మాలి కులానికి చెందిన ఆయన...కుల కట్టుబాట్ల కారణంగా చిన్ననాటి నుంచే అవమానాలను ఎదుర్కొన్నాడు. యుక్త వయస్సులో ఒక బ్రాహ్మణ మిత్రుని పెళ్లికి హాజరైన జ్యోతిరావును పెళ్లికొడుకు బంధువులు కులం పేరుతో అవమానించి పెళ్లి ఊరేగింపు నుంచి గెంటివేశారు. ఆ అవమానంతో రగిలిపోయిన ఫూలే కులాధిపత్యాన్ని నిర్మూలించడానికి అవిశ్రాంత పోరాటం కొనసాగించాలని ప్రతినబూనాడు. భారతీయ సమాజాన్ని మానవతా విలువల పునాదులపై పునర్నిర్మించడానికి గతంలో ఎందరో మహనీయులు కృషి చేశారు. బుద్ధుడు, కబీర్, గురునానక్, రవిదాస్, చైతన్య, నాందేవ్, వేమన లాంటివారెందరో కుల వ్యవస్థను పూర్తిగా పెకిలించివేసి ప్రత్యామ్నాయ, సమతావాద సంస్కృతిని నిర్మించడానికి పాటుపడ్డారు. ఆధునిక యుగంలో ఈ ఒరవడికి మళ్లీ జీవం పోసి...విద్య వెలుగులో కుల విష వృక్షాన్ని సమూలచ్ఛేదం చేయడానికి ఉద్యమం నడిపి మహాత్ముడై నిలిచాడు జ్యోతిబా ఫూలే. శూద్రులు, అతి శూద్రులపై అగ్రవర్ణాల వారు కొనసాగిస్తున్న దురాగతాలను నిరోధించడానికి ఫూలే 1873 సెప్టెంబరు 24న సత్య శోధక్ సమాజ్ సంస్థను స్థాపించాడు. నిమ్న వర్గాల ప్రజలను కుల దోపిడీ నుంచి విముక్తి చేయడంతోపాటు రైతులు, కూలీలను హక్కులకోసం సంఘటితపరిచేందుకు ఈ సంస్థ ద్వారా విశేష కృషి చేశాడు. విద్యాజ్ఞానాలను అందుకోవడం ద్వారానే శూద్ర, అతి శూద్రులు తమ హక్కులను నిలబెట్టుకోగలరని గుర్తించి వారిలో విద్యా వ్యాప్తి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పరచాడు. దళిత వర్గాల స్త్రీలకు సైతం విద్య అందాలనే ఉద్దేశంతో వారి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పరిచాడు. దళిత స్త్రీలకు చదువు చెప్పడానికి అగ్రవర్ణాల స్త్రీలు ముందుకు రాని పరిస్థితుల్లో తన భార్య సావిత్రీబాయికి చదువు నేర్పి, ఉపాధ్యాయినిగా తీర్చిదిద్ది ఆమె చేత దళిత స్త్రీలకు చదువు చెప్పించాడు.

విగ్రహారాధనను, కుల వ్యవస్థను, వేదాల పవిత్రతను ప్రశ్నించాలని ఫూలే ప్రజలకు ఉద్బోధించేవాడు. మూఢాచారాలను ఖండిస్తూ ప్రజల్లో హేతువాద ధోరణులను పెంపొందింప జేయడానికి సత్య శోధక్ సమాజ్ సభ్యులు పాటుపడ్డారు. పురాణాలు, వేదాలు దైవదత్తమైనవి కావని, మనుషులు రాసినవేనని, నేటి కాలానికి అనుగుణంగా వాటిలో మార్పులు కూడా చేసుకోవచ్చని వాదించేవాడు. కొందరు స్వార్థపరుల వికృత ఆలోచనల్లోంచే కుల వ్యవస్థ ఆవిర్భవించిందని తన సభల్లో వివరించేవాడు. పక్షుల్లో, జంతువుల్లో లేని కుల భేదాలు మానవుల్లో ఎందుకున్నాయని అగ్ర వర్ణాల పండితులను ఆయన నిలదీసేవాడు.

28న జ్యోతిబా ఫూలే 132వ వర్ధంతి

బొంబాయితో పాటు మహారాష్ట్ర లోని ముఖ్య పట్టణాల్లో సత్య శోధక్ సమాజ్ శాఖలను స్థాపించి ఉద్యమాన్ని విస్తృతపరిచాడు. కరపత్రాలు, సభలు, చిన్న పుస్తకాల ద్వారా సామాన్య ప్రజల్లో చైతన్యం కలిగించడానికి కృషి చేశాడు. తన భావాల వ్యాప్తి కోసం ఫూలే ఎన్నో పుస్తకాలను రాశాడు. గులాంగిరీ, సత్యార్, ఇషారా, సార్వజనిక్ సత్య ధర్మ పుస్తక్ అందులో ప్రముఖమైనవి. గులాంగిరీ పుస్తకంలో అమెరికా లోని బానిస వ్యవస్థకు, భారతదేశం లోని కుల వ్యవస్థకు గల పోలికలను విశదీకరించాడు. ప్రపంచంలోని పీడితులంతా ఒకే జాతి వారని, ఒకరి నుంచి మరొకరు స్ఫూర్తిని పొందుతూ ఉద్యమించాలని తెలియజెప్పాడు. బావులు, చెరువులు కూడా కులాల వారీగా చీలిపోయిన ఆ రోజుల్లో ఫూలే ఇంటి బావి నీటిని దళిత వర్గాల వారు సైతం తోడుకెళుతుండేవారు. కుల వివక్షను నిరాటంకంగా కొనసాగించడానికి అగ్రవర్ణ దురహంకారులు సృష్టించిన నిచ్చెన మెట్ల వ్యవస్థను కూలదోసి వర్ణ వ్యవస్థ బాధితులందరినీ ఐక్యం చేసి ముందుకు నడిపించిన మానవతావాది ఫూలే.

కులం కుళ్లును ఈ గడ్డపై నుంచి పూర్తిగా తుడిచివేసి భారత జాతిని సమతా శిఖరాల ఉన్నత స్థితికి చేర్చడానికి అవిశ్రాంతంగా కొనసాగించిన పోరాటం 1890 నవంబర్ 28న ఆయన తనువు చాలించడంతో ఆగిపోలేదు. ఫూలే రగిలించిన సాంఘిక విప్లవ జ్వాలను ఆ తర్వాత వచ్చిన అంబేద్కర్ అందిపుచ్చుకుని కుల వివక్ష నిర్మూలనా పోరాటాన్ని దేశవ్యాప్త విస్తృత ఉద్యమంగా మలిచాడు. తనలో ఉద్యమ జ్వాలను రగిలించిన గురుత్రయంగా బుద్ధుడు, కబీర్, ఫూలేలను పేర్కొంటూ బాబా సాహెబ్ వారిని గౌరవించేవాడు. దక్షిణాదిన పెరియార్ రామస్వామి...ఫూలే చూపిన బాటలో అగ్రవర్ణ దురహంకారుల ఆగడాలనెదిరిస్తూ ఆత్మగౌరవ ఉద్యమాన్ని కొనసాగించి ఎన్నో విజయాలను సాధించాడు. ఆంగ్లేయుల దాస్యం నుంచి మనం స్వేచ్ఛను పొంది డెబ్బై ఐదేళ్లు గడిచాయి. కుల వ్యవస్థ దాస్యపు సంకెళ్ల నుంచి మాత్రం ఈ జాతికి ఇంకా పూర్తి విముక్తి లభించలేదు. సరికొత్త రూపాల్లో మరింత వికృతంగా ఈ నాలుగు పడగల విషసర్పం ఇంకా బుసలు కొడుతూనే ఉన్నది. మనువాద శక్తులు నేడు మరింత బలాన్ని సంతరించుకుని రాజ్యాంగాన్నే సవాల్ చేస్తున్నారు. ఈ అమానవీయ మను సంస్కృతిని సమూలంగా నిర్మూలిస్తేనే ఈ దేశానికి పట్టిన పీడ విరగడై...మన దేశం ప్రపంచ దేశాల సరసన సగర్వంగా, సమున్నతంగా తలెత్తుకుని నిలబడగలదు. అందుకే నేటి కాలానికి జ్యోతిబా ఫూలే జీవన సందేశం, ఆయన బోధనల ఆవశ్యకత గతంలో కంటే మరింత ఎక్కువగా ఉన్నది!

**- ఆర్. రాజేశమ్,**
**సెల్: 9440443183**

సమస్య

## మూగజీవాలకు 'లంపి' ముప్పు

గత కొన్ని నెలలుగా, భారతదేశం అంతటా లంపి చర్మ వ్యాధి వ్యాపిస్తోంది. ఇది పశువులకు వచ్చే వైరల్ వ్యాధి. ఇది జంతువు శరీరం మొత్తాన్ని కప్పివేస్తుంది. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్‌తో సహా పద్దెనిమిది పైగా రాష్ట్రాల్లో ఈ వ్యాధి కారణంగా మూడు లక్షలకు పైగా పశువులు చనిపోయాయి.

లంపి స్కిన్ డిసీజ్ రాజస్థాన్‌లో అత్యంత వేగంగా వ్యాపిస్తోంది. ఇప్పటి వరకు గుజరాత్, రాజస్థాన్ లోనే 70,000 కంటే ఎక్కువ జంతువులు...ప్రధానంగా ఆవులు మరణించాయి. దాదాపు రెండు లక్షల పశువులకు ఈ వ్యాధి సోకింది. గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ నివేదిక ప్రకారం లంపి చర్మ వ్యాధి కాప్రిపోక్స్ అని పిలువబడే వైరస్ వల్ల వస్తుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా పశువులకు ముప్పుగా మారుతోంది. ఇది గోట్ పాక్స్, షీప్ పాక్స్ వైరస్ కుటుంబానికి సంబంధించినది. దీనివల్ల వచ్చే జ్వరం, చర్మం మీది బుడిపెలు మరణానికి కూడా దారితీస్తాయి.

ఈ వ్యాధి వల్ల దీర్ఘకాలిక బలహీనత, పాల ఉత్పత్తి క్షీణించడం, పెరుగుదల మందగించడం, వంధ్యత్వం, గర్భస్రావం మరియు కొన్నిసార్లు మరణానికి దారితీస్తుంది. ఈగలు, రక్తం పీల్చే దోమలు, పేలు ద్వారా ఈ వ్యాధి ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. ప్రస్తుతానికి లంపి వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. జంతువుల్లో కనిపిస్తున్న లక్షణాలను బట్టి చికిత్స అందిస్తున్నారు. వ్యాధి నిర్మూలన కష్టతరమైనది. అయితే ఈ వ్యాధిని నియంత్రించడానికి ముందస్తుగా గుర్తించడమే మెరుగైన మార్గమని వైద్యులు చెబుతున్నారు.

**- డా॥యం. సురేష్ బాబు**

బీహార్‌లో రైతుల మార్చ్

లక్నోలో అభివాదం చేస్తున్న ఎస్‌కెఎం నేతలు

తమిళనాడు, త్రిపురలో అన్నదాతల ర్యాలీలు

# గర్జించిన రైతన్న

- రాజ్‌భవన్లకు మార్చ్‌లో లక్షలాదిమంది రైతులు
- రాష్ట్రపతికి, గవర్నర్లకు ఎనిమిది డిమాండ్లతో వినతి

**రైతన్నలు మరోసారి గర్జించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానులు రైతు నినాదాలతో దద్దరిల్లాయి. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపులో భాగంగా రాజ్‌భవన్‌ల మార్చ్ శనివారం దిగ్విజయంగా జరిగింది. ఎస్‌కెఎం పిలుపుతో రైతులతోపాటు కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, సామాన్య ప్రజలు రాష్ట్రాల రాజధానుల్లో భారీ పాదయాత్రలు, ర్యాలీ, కవాతులు నిర్వహించారు. 25 రాష్ట్రాల రాజధానుల్లో 300లకు పైబడి జిల్లా కేంద్రాల్లో, వేలాది తాలూకా కేంద్రాల్లో భారీ సభలు జరిగాయి. దేశవ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి.**

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా రాజ్‌భవన్ మార్చ్‌లలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు 50 లక్షల మందికిపైగా రైతులు కదం తొక్కారు. చండీగఢ్, లక్నో, పాట్నా, కోల్‌కతా, తిరువనంతపురం, చెన్నై, హైదరాబాద్, భోపాల్, జైపూర్, విజయవాడ, అగర్తలా, దిస్పూర్, ముంబయి, రాంచీ, పనాజీతోపాటు అనేక ఇతర రాష్ట్ర రాజధానుల్లో లక్షలాది మంది ప్రజలు భారీ ప్రదర్శన నిర్వహించారు. పంజాబ్‌లోని చండీగఢ్‌లో 40 వేల మందితో భారీ ర్యాలీ జరిగింది. రాజ్‌భవన్ వైపుగా వెళ్తున్న ర్యాలీని చండీగఢ్ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం భారీ బహిరంగ సభ జరిగింది. ఎస్‌కెఎం నేతలు గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించారు. సభలో అశోక్ ధావలే, జోగిందర్ సింగ్ ఉగ్రహన్, దర్శన్ పాల్, బూటా సింగ్ బుర్జ్‌గిల్, బల్దేవ్ సింగ్ నిహాల్‌గర్, రుల్దు సింగ్ మాన్సా తదితరులు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో భారీ కిసాన్ ర్యాలీ జరిగింది. అనంతరం ఎకో మైదాన్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో హన్నన్ మొల్లా, రాకేష్ తికాయత్ తదితరులు మాట్లాడారు.

**మలిదశ పోరాటానికి నాంది**

సామూహిక బలంతో భారీ ప్రదర్శన, రైతుల అన్ని డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని రైతు నేతలు స్పష్టం చేశారు. 2020 నవంబర్ 26న ఎస్‌కెఎం చారిత్రాత్మకమైన "ఢిల్లీ చలో" ఉద్యమాన్ని ప్రారంభించిందనీ, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద రైతు ఉద్యమంగా అవతరించిందని తెలిపారు. రెండేళ్ల తర్వాత అదే రోజున దేశవ్యాప్తంగా "రాజ్ భవన్ మార్చ్‌లు' నిర్వహించామని తెలిపారు. ఇది రైతుల మలిదశ పోరాటానికి నాందని స్పష్టం చేశారు. 'రాజ్‌భవన్ మార్చ్‌ల' కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు

పంజాబ్ సభలో మాట్లాడుతున్న దర్శన్‌పాల్

రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, పౌర సమాజానికి ఎస్‌కెఎం నేతలు అభినందనలు తెలిపారు. నిబద్ధతతో కూడిన దేశవ్యాప్త పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. రైతు వ్యతిరేక బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు గర్జించారు. రాష్ట్రపతికి, రాష్ట్రాల గవర్నర్లకు రైతుల డిమాండ్లతో కూడిన మెమోరాండం పంపారు.

**ఎనిమిది డిమాండ్లతో వినతులు**

1. రైతులందరికీ అన్ని పంటలకు సి+20 శాతంతో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి. 2. సమగ్ర రుణమాఫీ పథకంతో రుణభారం నుంచి రైతులకు విముక్తి కల్పించాలి. 3. విద్యుత్ సవరణ బిల్లు-2022ను ఉపసంహరించుకోవాలి. 4. లఖింపూర్ ఖేరి రైతుల, జర్నలిస్ట్ మారణకాండలో నిందితుడైన కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ కుమార్ టెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆయనను పదవి నుంచి తొలగించాలి. 5. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం అందించేందుకు సమగ్ర, ప్రభావవంతమైన పంటల బీమా పథకం తీసుకురావాలి. 6. సన్నకారు, చిన్న, మధ్య తరహా రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ. 5,000 రైతు పింఛను ఇవ్వాలి. 7. రైతు ఉద్యమంలో రైతులపై నమోదైన అన్ని తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలి. 8. అమరులైన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి" అని డిమాండ్ చేశారు. వీటితో పాటు రైతుల ఉద్యమ సమయంలో ఆయా రాష్ట్రాల్లో నెలకొన్ని స్థానిక డిమాండ్లను కూడా లేవనెత్తారు.

## తైవాన్‌లో ప్రతిపక్షం గెలుపు

- చైనా వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టిన ప్రజలు

**తైపే :** తైవాన్‌లో చైనా వ్యతిరేక ప్రచారాన్ని ప్రజానీకం తిప్పికొట్టింది. దేశ వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చైనా వ్యతిరేక ప్రచారాన్నే ప్రధాన అజెండాగా చేసుకున్న అధికార పార్టీ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డిపిపి)కి ఘోర పరాజయం ఎదురైంది. దీంతో తైవాన్ అధ్యక్షురాలు సాయి ఇంగ్ వెన్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. స్థానిక ఎన్నికలే అయినప్పటికీ వీటిని ఆమె ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 'ప్రపంచం చూస్తోంది..' అంటూ చైనా వ్యతిరేక ప్రచారాన్ని భారీగా నిర్వహించారు. తైవాన్ ప్రజలు చైనాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, అది ఏ స్థాయిలో ఉందో ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రపంచం చూస్తుందని ఆమె పదేపదే చెప్పారు. దీనికి భిన్నంగా ప్రతిపక్షలో ఉన్న కొమింటాంగ్ పార్టీ (కెఎంటి) చైనాతో డిపిపి ప్రభుత్వ వైరం శ్రుతి మించుతోందని, ఇది దేశానికి ప్రమాదమని ఎన్నికల ప్రచారంలో చెప్పింది. సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడమే తమ విధానమని, అదే సమయంలో చైనాకు కొమ్ముకాయబోమని ఆ పార్టీ నేతలు చెప్పారు. ఎన్నికల ఫలితాల్లో ప్రజానీకం కెఎంటి వైపు స్పష్టమైన మొగ్గు చూపారు. 21 నగర మేయర్ స్థానాలకు ఎన్నికలు జరగగా పదమూడింటిని కెఎంటి కైవసం చేసుకుంది. వీటిలో తైవాన్ రాజధాని నగరం తైపే కూడా ఉంది. మిగిలిన స్థానాల్లో కూడా అధికారపార్టీకి బొటాబొటీ మెజార్టీ మాత్రమే లభించింది. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ అధ్యక్షపదవికి రాజీనామా చేసిన తైవాన్ అధ్యక్షురాలు తమ విధానాలను ప్రజలు ఆమోదించలేదని చెప్పారు.

## ఐఐటిఎఫ్‌లో ఘనంగా ఏపి డే

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటిఎఫ్)లో ఆంధ్రప్రదేశ్ డే ఘనంగా జరిగింది. ప్రగతి మైదానంలో 41వ ఐఐటిఎఫ్ జరుగుతోంది. అందులో శనివారం ఏపి డే జరిగింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి లిమిటెడ్ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, ఎపిటిపిసి చైర్మన్ కనుమూరు రవిచంద్రారెడ్డి, ఎపి హెచ్‌డిసి చైర్‌పర్సన్ బడిగించాల విజయలక్ష్మి, ఎపిఐడిసి చైర్మన్ బండి శివశక్తి నాగేంద్ర పుణ్యశీల, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకట రెడ్డి, ఎపి ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# మతతత్వ అజెండాతోనే బిజెపి మేనిఫెస్టో

- గుజరాత్‌లో యుసిసి తెస్తామని హామీ
- యుపి తరహాలో నష్ట పరిహార చట్టం

**అహ్మదాబాద్ :** గుజరాత్ ఎన్నికల్లో మతతత్వ అజెండాతోనే నెట్టుకురావాలని బిజెపి వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికల కోసం శనివారం ఆ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో సాంతం మతతత్వ అజెండాతోనే నిండిపోయింది. హిందూత్వ ఓటు బ్యాంకు కొల్లగొట్టడమే ధ్యేయంగా వండివార్చింది. తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చింది. గుజరాత్ ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) కమిటీ ప్రతిపాదనలన్నిటినీ అమల్జేస్తామని పేర్కొంది. ఉగ్రవాద నిరోధానికి ఇప్పటికే అనేక చట్టాలుండగా .. ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన స్లీపర్ సెల్స్‌ను పసిగట్టేందుకు, రాష్ట్ర, దేశ భద్రతకు సవాళ్లుగా మారిన తీవ్రవాద కార్యకలాపాలను పసిగట్టేందుకు ప్రత్యేకంగా యాంటీ ర్యాడికలైజేషన్ సెల్ ఏర్పాటు చేస్తామని కూడా బిజెపి ప్రకటించింది. ఇదే తరహా ప్రత్యేక బృందాలు

ఏర్పాటు చేయడం వెనుక అసలు లక్ష్యం మైనార్టీలను ఆ పేరిట వేధింపులకు గురి చేయడమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

నిరసనలు, అల్లర్లు, ఘర్షణలు చెలరేగినప్పుడు ఏదైనా నష్టం జరిగితే సదరు నిర్వాహకుల నుంచే నష్ట పరిహారం రాబట్టేందుకు గుజరాత్ రికవరీ డ్యామేజెస్ ఆఫ్ పబ్లిక్ అండ్ ప్రయివేటు ప్రాపర్టీస్ చట్టం కూడా తీసుకొస్తామని బిజెపి హామీ ఇచ్చింది. ఇదే తరహా చట్టంతో ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలను ఎంతగా వేధిస్తోందో దేశమంతా చూసింది. ఇప్పుడు గుజరాత్‌లోనే అలాంటి చట్టాన్ని తెరపైకి తీసుకురావడం కచ్చితంగా ఓటు బ్యాంకు జిమ్మిక్కులేనని స్పష్టమవుతోంది.

182 అసెంబ్లీ స్థానాలున్న గుజరాత్ శాసనసభ ఎన్నికలు రెండు విడతలుగా జరగనున్న సంగతి తెలిసిందే. డిసెంబరు 1న 89 స్థానాలకు, అదే నెల 5న 93 స్థానాలకు పోలింగ్ జరగనుంది. బిజెపి అన్ని స్థానాల్లోనూ తన అభ్యర్థులను పోటీలో నిలపగా అనేక చోట్ల తిరుగుబాట్లు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ 179 స్థానాల్లో పోటీ చేస్తుండగా మిగిలిన మూడు స్థానాలను ఎన్‌సిపికి కేటాయించింది. అయితే ఎన్‌సిపి రెండు స్థానాల్లోనే బరిలో ఉంది. ఇంకొక స్థానమైన దేవగఢ్ బరియాలో ఎన్‌సిపి అభ్యర్థి తన నామినేషన్‌ను సోమవారం ఉపసంహరించుకుంటానని ప్రకటించారు. సిపిఎం తొమ్మిది స్థానాల్లో బరిలో నిలిచింది. సిపిఎంను గెలిపించండి, బిజెపిని ఓడించండి నినాదంతో విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

## ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇడి తొలి చార్జ్‌షీట్

### మూడు వేల పేజీల చార్జ్‌షీట్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తొలి చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. మూడు వేల పేజీలతో కూడిన చార్జ్‌షీట్‌ను హార్డ్ డిస్క్, కాపీలను కోర్టుకు సమర్పించింది. రౌస్ అవెన్యూలో సీబీఐ ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్‌ను ఈడీ అధికారులు శనివారం దాఖలు చేశారు. ఛార్జ్ షీట్‌లో ఏ1గా ప్రముఖ లిక్కర్ వ్యాపారి, ఇండోస్పిరిట్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ మహేంద్రును చేర్చింది. ఏ2, ఏ3, ఏ4, ఏ5గా పలు కంపెనీల పేర్లను పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టుచేసిన వారిపై సప్లిమెంటరీ చార్జ్‌షీట్లు కూడా ఉన్నాయని ధర్మాసనానికి ఈడీ న్యాయవాది తెలిపారు. ఇప్పటికే అన్ని వివరాలు ఈడీకి సమర్పించినట్లు సమీర్ మహేంద్రు తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగ్ పాల్.. డాక్యుమెంట్ల సంఖ్య ఎక్కువగా ఉందని వ్యాఖ్యానిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 12కు వాయిదా వేశారు. మరోవైపు ఆప్ కమ్యూనికేషన్ ఇంచార్జ్ విజయ్ నాయర్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు 13 రోజుల జ్యుడిషియల్ కస్టడి విధించింది. తదుపరి విచారణను డిసెంబర్ 8కి వాయిదా వేసింది.

## విదేశీ విద్యార్థులపై ఆంక్షలు?

- బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ యోచన

**లండన్ :** బ్రిటన్‌కు పెరుగుతున్న వలసలను నియంత్రించే ప్రయత్నంలో విదేశీ విద్యార్థుల సంఖ్యను తగ్గించడంతోసహా అన్ని అవకాశాలను బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ పరిశీలిస్తున్నారు. తక్కువ నాణ్యత కలిగిన డిగ్రీలు చదివే విదేశీ విద్యార్థులపై, వారు డిపెండెంట్లను తీసుకురావడంపై ఆంక్షలు విధించాలని సునాక్ యోచిస్తున్నారని డౌనింగ్ స్ట్రీట్ ప్రతినిధి తెలిపారు. తక్కువ నాణ్యత కలిగిన డిగ్రీ అంటే ఏమిటనేది ఆయన నిర్వచించలేదు. ఈ వారంలో తాజాగా జాతీయ గణాంకాల కార్యాలయం (ఒఎన్‌ఎస్) విడుదల చేసిన వలసలు, శరణార్థుల సంఖ్య పట్ల బ్రిటన్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. భారత సంతతికి చెందిన సునాక్ అధికారంలోకి రావడం వల్ల భారతీయులకు ప్రయోజనాలు కలుగుతాయని ప్రచారం జరుగుతున్న తరుణంలో తాజాగా వస్తున్న వార్త భారతీయ విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోంది.

## బూస్టర్ డోస్‌గా భారత్ బయోటెక్ చుక్కల మందు

**న్యూఢిల్లీ :** కరోనా వ్యాధి నివారణకు భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన చుక్కల మందు టీకా ఇన్ కొవాక్‌ను బూస్టర్ డోస్‌గా వినియోగించేందుకు డీజీసీఐ అత్యవసర అనుమతి ఇచ్చినట్టు తెలిసింది. దీన్ని 'ఫైవ్ ఆర్మ్' బూస్టర్ డోస్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటికే రెండు డోసుల కోవాగ్జిన్, కోవిషీల్డ్ టీకా తీసుకున్న వారు 6 నెలల తర్వాత బూస్టర్ డోస్‌గా ఈ చుక్కల మందు తీసుకోవచ్చు. భారత్‌లో 18 ఏండ్ల వయసు దాటిన వారు ఈ టీకా తీసుకునేందుకు డీజీసీఐ అనుమతి ఇచ్చింది.

## ముంబయి అమరవీరులకు ఘన నివాళి

**ముంబయి :** 14ఏళ్ళ క్రితం ముంబయి నగరంపై జరిగిన దాడిలో తీవ్రవాదులతో పోరాడుతూ అశువులు బాసిన అమరవీరులకు మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోషియారి, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేలు ఘనంగా నివాళి అర్పించారు. దక్షిణ ముంబయిలోని పోలీసు కమిషనర్ కార్యాలయ ఆవరణలో అమరవీరుల స్మారకం వద్ద వారు నివాళులర్పించారు.

## ఉత్తర కొరియాతో కలిసి పనిచేస్తాం

- కిమ్‌కు జిన్‌పింగ్ లేఖ

**బీజింగ్ :** ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి సుస్థిరతల కోసం, సంక్షేమం కోసం ఉత్తర కొరియాతో కలిసి పనిచేయడానికి చైనా సుముఖంగా వుందని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌కు లేఖ రాసినట్లు ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా కెసిఎన్ఎ శనివారం తెలిపింది. కాలంతోపాటు అనూహ్యంగా ప్రపంచంలో మార్పులు సంభవిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్యాంగాంగ్‌తో పరస్పరం సహకరించుకోవడానికి చైనా సుముఖంగా వుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. గత నెలలో చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరిగిన తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడో పదవీ కాలానికి జిన్‌పింగ్ ఎన్నికైన నేపథ్యంలో ఆయనను అభినందిస్తూ ఉత్తర కొరియా అభినందన సందేశం పంపింది. దానికి ప్రతిగా జిన్‌పింగ్ ఈ లేఖ రాశారు.

## ఆనంద్ తెల్తుంబ్డే విడుదల

**ముంబయి :** ఎల్గార్ పరిషద్ కేసులో నిందితుడు, సామాజిక కార్యకర్త ఆనంద్ తెల్తుంబ్డే శనివారం జైలు నుంచి విడుదలయ్యారు. ఆయన బెయిల్‌ను సవాలు చేస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిన మరుసటి రోజు నవీ ముంబయిలోని తలోజా సెంట్రల్ జైలు నుంచి విడుదల చేశారు. జైలు వెలుపల విలేకర్లతో మాట్లాడుతూ ఆయన, "31మాసాల అనంతరం నేను విడుదల కావడం సంతోషంగా వుంది. కానీ, మాపై ఈ కేసు మోపిన తీరు దురదృష్టకరం." అని వ్యాఖ్యానించారు. కాగా, విడుదలైనా ఆయన ముంబయిలోనే కోర్టు పరిధిలోనే వుండాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. లక్ష రూపాయిల నగదు పూచీకత్తును సమర్పించడానికి 8 వారాల గడువును ఇచ్చినట్లు ప్రత్యేక న్యాయమూర్తి ఆర్.జె.కటారియా తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విడుదల ఉత్తర్వులను ఎన్ఐఎ జారీ చేసింది. ఈ నెల 18నే బాంబే హైకోర్టు టెల్టుంబ్డెకు బెయిల్ మంజూరు చేసింది.

## గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు ?

### పథకం సమర్థతపై అంచనాకు కమిటీ ఏర్పాటు

**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచేందుకు తొలి నుంచి ప్రయత్నిస్తున్న మోడీ సర్కారు తాజాగా అందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ పథకం అమలు సమీక్షించే పేరిట కమిటీని ఏర్పాటు చేసింది. దారిద్ర్య నిర్మూలనా సాధనంగా ఈ కార్యక్రమం పనిచేస్తోందా లేదా అనే కోణంలో ఈ పథకం సమర్థతను అంచనా వేయడం ఈ కమిటీ ముఖ్య లక్ష్యమని కేంద్రం పేర్కొంది. గామీణాభివృద్ధి మాజీ కార్యదర్శి అమర్జీత్ సిన్హా నేతృత్వంలోని కమిటీ ఈ నెల 21న మొదటిసారిగా సమావేశమైంది. తన సూచనలు తెలియజేసేందుకు కమిటీకి మూడు మాసాల సమయాన్ని ఇచ్చారు. ఈ పథకం కింద కేటాయించే పనులు, ఖర్చులు, రాష్ట్రాల మధ్య గల తేడాలు, పనుల కూర్పులో తేడాలు వంటి వివిధ అంశాలపై సిన్హా కమిటీ అధ్యయనం చేయాల్సి వుంది. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు, తీసుకురావాల్సిన మార్పులను, పనుల వ్యయం పెరిగిపోయిందనే వాదనను ఈ కమిటీ పరిశీలించనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేందుకే ఈ కమిటీ వేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని మోడీతో సహా పలువురు దీనిపై పలు సందర్భాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఈ వాదనలను బలపరుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమే ఈ పథకమని 2015లో ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా కోవిడ్ సమయంలో ఇదొక కీలకమైన భద్రతా చర్యగా వ్యవహరించిందని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2020-21, 2021-22లో ఈ పథకం కింద పనిచేసిన వారి సంఖ్య, పనిచేసిన రోజులు గణనీయంగా పెరిగాయి.

## సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. మోడీ పాలనలో అదాని ఆస్తి లక్షల కోట్ల రూపాయలు పెరిగి ప్రపంచ కుబేరుల్లో చోటు సంపాదించాడని గుర్తు చేశారు. దేశంలో దాదాపు కోటిమంది పనిచేస్తోన్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా వర్కర్స్ ఇలా వివిధ రకాల స్కీమ్ వర్కర్లకు తన ఎనిమిదేళ్ల పాలనలో మోడీ చేసేందేమీ లేదన్నారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత సమస్యలతో బాధపడుతున్న పేద మహిళలు, శిశువులకు పౌష్టికాహారం అందిస్తోన్న ఐసిడిఎస్‌కు కేవలం రూ.30 వేల కోట్లే కేటాయించారని తెలిపారు. ఐసిడిఎస్‌కు కేంద్రం వాటా 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించిందన్నారు. దీంతో ఈ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించలేమంటున్నాయని, కేంద్రం నిధులు ఇవ్వట్లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రకరకాల యాప్‌లను తెచ్చి అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెంచిందన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అధిక వేతనాలు ఇస్తామని జగన్ ప్రభుత్వం వాగ్దానం చేసి విస్మరించిందని తెలిపారు. మహాసభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ముగింపు ఉపన్యాసం చేస్తూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రూ.10 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిందని, ఉద్యోగులకు, సామాన్య ప్రజలకు మాత్రం ఎటువంటి ప్రయోజనాలు కల్పించడం లేదని తెలిపారు. ఆర్మీలో సైతం పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా అగ్నిపథ్ స్కీంను ప్రవేశపెట్టిందన్నారు. ఒడిశాలో తీవ్ర స్థాయిలో ఆందోళన చేసిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అక్కడి ప్రభుత్వం ఒక్కరోజులోనే పర్మినెంట్ చేసిందని గుర్తు చేశారు. ఒడిశా బాటలోనే 1.03 లక్షల మందిని రాజస్థాన్ ప్రభుత్వం పర్మినెంట్ చేసిందని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా వైసిపి ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి ఎస్.వరలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తదితరులు ప్రసంగించారు. అనంతరం మహాసభ ప్రాంగణం నుండి కలెక్టరేట్ మీదుగా నగరంపాలెం పోలీసు స్టేషన్ వరకూ ప్రతినిధులు, అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు.

## కేశవరెడ్డి సేవలు మరువలేనివి

(మొదటి పేజీ తరువాయి)

చేయడం సముచితమని తమ కమిటీ భావించిందని అన్నారు.. పిల్లలు ఆడుతూ పాడుతూ విద్య గరిపేలా పాఠశాలలో వాతావరణం ఉండాలనే భావనను ఆచరణలో పెట్టిన వ్యక్తి పరిమి అని తెలిపారు. సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ, సాహితీ స్రవంతి విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. . కేశవరెడ్డి కృషికి కొనసాగింపుగానే ఈ అవార్డు ఎంపిక ఉందని ఆయన అన్నారు. మహాకవి గురజాడ పేరుతో నెలకొల్పిన అవార్డును స్త్రీలను అవమానపరిచిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. . దీనిపై రాష్ట్రవ్యాప్తంగా సాహితీ స్రవంతి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కేశవరెడ్డి అనువదించిన 'గోర్కీ నగరం' ఆడియోను సినీ దర్శకులు సి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అవార్డు గ్రహీత ఎస్ఆర్ పరిమి మాట్లాడుతూ, చదువు పేరుతో బడిలో పిల్లలను ఒత్తిడికి గురిచేయడం సరైన పద్ధతి కాదనే ఉద్దేశంతో వికాస విద్యాసంస్థను నాలుగు దశాబ్దాల క్రితం నెలకొల్పడం జరిగిందని అన్నారు..ఆ స్ఫూర్తితోనే ఇక ముందు కూడా కొనసాగుతుందని చెప్పారు. అనంతరం ఎస్ఆర్ పరిమికి సాహితీ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు ద్వారా వచ్చిన రూ. 25,000 వికాస విద్యా వనానికి జమచేస్తామని తెలిపారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో చైల్డ్‌లేబర్ ప్రాజెక్టు డైరెక్టర్ డి ఆంజనేయరెడ్డి, అరవింద విద్యాసంస్థల డైరెక్టర్ ఇంద్రాణి కేశవరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, సమన్విత కన్వీనర్ డి శమంతకమణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాందేవ్ బాబా నోటిదురుసు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో ఒక్కరు కూడా కనీస అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం. మహిళల పట్ల బిజెపికి ఉన్న చులకన భావనకు ఈ ఘటనే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**నిరసనల వెల్లువ**

రాందేవ్ బాబా చేసిన అనుచిత వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. మహారాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ నీలం గోర్హే వీటిని తీవ్రంగా ఖండించారు. రాందేవ్ వ్యాఖ్యలు దిగజారిన అతని మానసిక స్థితిని తెలియజేస్తోందని గోర్హే వ్యాఖ్యానించారు. రాందేవ్ వ్యాఖ్యలను మహారాష్ట్ర రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కమిషన్ చైర్‌పర్సన్ రూపాలీ ఛకాన్కర్ ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తక్షణమే రాందేవ్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శివసేన నేత సంజయ్ రౌత్ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించారు. ఇటీవల శివాజీని అవమానిస్తుంటే మహారాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించిందని, ఇప్పుడు మహిళలను రాందేవ్ అవమానిస్తే కూడా ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందని అన్నారు. ఎన్‌సిపికి చెందిన పలువురు మహిళా కార్యకర్తలు రాందేవ్ చిత్రపటానికి చెప్పుల దండలు వేసి నిరసన తెలియజేశారు. హైదరాబాద్‌లో రామ్‌దేవ్‌బాబా వ్యాఖ్యలను నిరసిస్తూ, కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వ్యాఖ్యలపై సిపిఐ నాయకులు నారాయణ స్పందిస్తూ, వ్యాఖ్యలు చేసిన సమయంలో అక్కడే ఉన్న మహిళలు చెప్పుతో కొట్టి బుద్ధిచెప్పాల్సిందని అన్నారు.

**తిరుపతిలో పోలీసులకు ఫిర్యాదు**

మహిళలను అవమానసరుస్తూ వ్యాఖ్యలు చేసిన రాందేవ్‌బాబాను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే కేసు నమోదు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడారు.. జాతీయ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసును తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మీ కోసం

బట్టలపై పడిన ఇంకు మరకలను నిమ్మరసం లేదా టూత్‌పేస్ట్‌తో రుద్దితే పోతాయి.

### జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా లేక ముందుకు సాగిపోవడమా అనేది నీ అడుగుల్లోనే ఉంటుంది.

# ప్రాణం విలువ

ఒక అడవిలో రెండు కుందేళ్లు ఉండేవి. అవి స్నేహంగా ఉండేవి. ఒకరోజు అందులో ఒక కుందేలుకు అడవి దారిలో ఒక తీపి రొట్టె కనిపించింది. అది రెండో కుందేలూ చూసింది. ఆ రొట్టె కోసం రెండూ గొడవపడ్డాయి. ఆ దారి గుండా వెళుతున్న ఓ మనిషి కుందేళ్ల గొడవను చూశాడు.

వాటితో... 'మీరు రొట్టె కోసం గొడవ పడకండి. నేను ఇద్దరికీ సమానంగా పంచుతాను. నాకు ఇవ్వండి' అని అడిగాడు. కుందేలు రొట్టెను ఆ మనిషికి ఇచ్చింది. కాని అతను తీపి రొట్టెను చక్కగా తినేశాడు. కుందేళ్లను పట్టుకోవడానికి ప్రయత్నం చేశాడు. అవి ఆ మనిషి నుంచి తప్పించుకోవడానికి పరుగు పెట్టాయి. సమీప గ్రామంలోకి చేరుకున్నాయి. ఒక చెత్త కుండీలో దాక్కున్నాయి. వాటిని వెంబడిస్తూ ఆ మనిషి కూడా ఆ గ్రామానికి వచ్చాడు. చాలాసేపు కుందేళ్ల కోసం వెతికాడు. అవి దొరక్క పోవడంతో నిరాశగా తిరిగి వెళ్లిపోయాడు.

కొంత సమయం తర్వాత చెత్తకుండీ నుంచీ రెండు కుందేళ్లూ బయటకు వచ్చాయి. వాటిని చూసిన వీధి కుక్కలు దాడి చేశాయి. వాటిని తప్పించుకుని ప్రాణభయంతో అడవి వైపు పరుగులు పెట్టాయి. అడవికి చేరాయి. కుక్కలు అడవిలోకి వెళ్లకుండా తిరిగి గ్రామానికి వెళ్లిపోయాయి. కుందేళ్లు అడవికి చేరిన తర్వాత 'స్నేహితులమై మనలో మనం రొట్టె కోసం తగువు పడి ప్రాణాలు మీదకు తెచ్చుకున్నాం. తీపి రొట్టె పోతే పోయిందిలే కానీ మనకు మాత్రం బుద్ధి వచ్చింది. ప్రాణం విలువ మనకు తెలిసింది. ఇకనైనా మనకు దొరికిన ఆహారాన్ని సమానంగా పంచుకొని తిందాం.' అని రెండు కుందేళ్లూ అనుకున్నాయి.

**– ఆసుపత్రి కిరణ్ కుమార్**
**5వ తరగతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,**
**బోరివంక, శ్రీకాకుళం జిల్లా.**

## బొమ్మ గీయండి!

**చిన్నారులూ , ఈ రోజు గద్ద బొమ్మ గీయడం నేర్చుకుందాం. బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా ఇక్కడ బొమ్మ గీయండి.**




## నేను గీసిన బొమ్మ

**- ఎస్‌కె. మహవీన్,**
**7వ తరగతి,**
**అరవింద హైస్కూలు,**
**కుంచనపల్లి,**
**గుంటూరు జిల్లా.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ:** chinnaarips@gmail.com

## పరిస్థితులు వెనక్కులాగినా...
# పట్టుదల ముందుకు నడిపించింది!

లక్ష్మికి చిన్న వయసులోనే పెళ్లి అయ్యింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. అయినా తనకు ఇష్టమైన చదువును, క్రీడలను వదల్లేదు. అదే ఆమెను అభివృద్ధి వైపుకు నడిపించింది. తన కాళ్ల మీద తాను నిలబడాలన్న పట్టుదలే తనని ఉన్నస్థాయికి చేర్చింది. ఆమె ఇప్పుడు హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయినిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తల్లిగా పిల్లల అవసరాలు తీర్చుతూ, కుటుంబ బాధ్యతలు పంచుకుంటూ...మరోవైపు అథ్లెటిక్స్, కబడ్డీ క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ నెల విశాఖలో జరిగిన 42వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని బంగారు, రెండు వెండి పతకాలు సాధించారు.

ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం తెల్ల దేవరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ తల్లిదండ్రులు పేదవారు. తండ్రి రంగారావు రిక్షా నడుపుతారు. తల్లి రమణమ్మ కూలీ పనులకు వెళుతుంది. లక్ష్మీ మూడో తరగతి చదువుతున్నప్పుడు తమ్ముడిని చూసుకోమని చెప్పి తల్లి రమణమ్మ ఉపాధి పనులకు వెళ్లేది. దాంతో ఆమె చదువు ఆగిపోయింది. స్కూలుకు వెళ్లే తోటి పిల్లల్ని చూస్తూ తాను చదువుకోలేక పోతున్నానని బాధపడేది. తమ్ముడి అవసరాలు తీరుస్తూ, తల్లి వచ్చే సమయానికి ఇంట్లో పనిచేసేది. అలా రెండేళ్లు ఆమె చదువు నిలిచిపోయింది. ఈ క్రమంలో రమేష్ అనే ఉపాధ్యాయుడు వారి తండాలో బ్రిడ్జ్‌కోర్సు ద్వారా డ్రాపౌట్ అయిన పిల్లలకు నెలరోజులు చదువు చెప్పారు. లక్ష్మి పరిస్థితి గమనించిన ఆయన స్కూలుకు రమ్మని సూచించారు. 'నేను చదువుకుంటా. కాని తమ్ముడ్ని చూసుకోవాలి.' అని చెప్పింది లక్ష్మి. ఆయన తమ్ముడితోనే స్కూలుకు రమ్మని, వస్తే రోజూ రూ.50 లు ఇస్తానని చెప్పారు. దాంతో ఆమె ఒక చంకలో తమ్ముడిని, మరో చంకలో పుస్తకాల బ్యాగు తగిలించుకుని స్కూలుకు వెళ్లింది.

అక్కడ టీచర్లు చెప్పే పాఠాలు, మాటలు తనని ఎంతగానో ప్రభావితం చేశాయి. ఎలాగైనా చదుకోవాలన్న ఆశా పెరిగింది. ఆ ఉపాధ్యాయుడు డబ్బులు ఇచ్చిన ప్రతిసారీ మరుసటి రోజు స్కూలుకు రమ్మని ఆమెకు చెబుతుండేవారు.

అలా లక్ష్మీలో చదువుకోవాలన్న పట్టుదల గ్రహించారు తల్లిదండ్రులు. స్థానిక పాఠశాల్లో చేర్పించారు. చదువుకుంటూనే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రాసి మంచి ర్యాంకు సాధించింది. నూజివీడు బాలికల గురుకుల పాఠశాల్లో చేరింది. 'ఆడపిల్లలు జీవితంలో పైకి రావాలంటే ఆటలు నిత్యం ఆడుతుండాలి. అవి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచేలా చేస్తాయి' అని పీఈటీ అన్నె సీతాకుమారి చెప్పిన మాటలు లక్ష్మి జీవితానికే బాటగా నిలిచాయి. కష్టపడి చదువుతూనే, కబడ్డీ, అథెటిక్స్ పోటీల్లో పాల్గొనేది. మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. ఆమె ప్రతిభను చూసి ఉపాధ్యాయులు ప్రతి విషయంలో ప్రోత్సహిస్తూ, అభినందించేవారు. అదే ఉత్సాహంతో పదో తరగతిలోనూ మంచి మార్కులు సాధించింది.

### పెళ్లి తర్వాత చదువు

బిడ్డను ఇంటర్ చదివించే స్థోమత తమకు లేదని తల్లిదండ్రులు అనడంతో గ్రామంలోని కొంతమంది పెద్దలు ఆమె చదువుకు ఆర్థిక సాయం చేశారు. కావాల్సిన వసతులు ఏర్పాటు చేశారు. 'పై చదువులు చదివిస్తే ఆ స్థాయి కట్నాలు ఇచ్చి అల్లుడిని చూడాలి. మా వల్ల కాదు'.. అంటూ ఇంటర్ తర్వాత ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేశారు. చదువు పట్ల లక్ష్మి ఆసక్తి గ్రహించి అత్తింటి వారు డిగ్రీ చదివించారు. అదే సమయంలో ఆమె 30 సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది.కాని కుటుంబం బాధ్యతలు ఆమెను ముందుకు వెళ్లనివ్వలేదు. తర్వాత ఒక పాప, బాబు పుట్టారు. పిల్లలను సాకుతూనే రెండేళ్ల బిటిడి కోర్సు పూర్తి చేసి వ్యాయమ ఉపాధ్యాయినిగా ఉద్యోగం సంపాదించారు లక్ష్మి. ఇప్పుడు తిరువూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఖోఖో, అథ్లెటిక్స్, కబడ్డీ, యోగాలో శిక్షణ ఇస్తూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సహజంగా పెళ్లి.. పిల్లలు.. ఉద్యోగం తర్వాత ఇక ఆటలు ఆడటం ఎందుకు? అని లక్ష్మిని చాలా మంది నిరుత్సాహపరిచారు. మగవాళ్లలా ఆఫ్ నిక్కర్లు, చొక్కా వేసుకుని కనిపించడం అవసరమా? అని ముఖమ్మీదే అడిగిన వారూ ఉన్నారు. అప్పుడు ఆమె ఓ తల్లిలా, భార్యలా ఆలోచించి చాలా పోటీలకు వెళ్లలేదు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు అవకాశం వచ్చినా పాల్గొనలేదు. కాని విద్యార్థులను తయారు చేసే క్రమంలో తనను తాను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలనుకున్నారు. ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా పోటీల్లో పాల్గొనాలనుకున్నారు. ఈ నెల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి ఆదర్శంగా నిలిచారు.

**– పద్మావతి**

## పెదాల పరిరక్షణ ఇలా



చలికాలం వచ్చిందంటే చాలు పెదవులు పగిలి ఇబ్బంది పెడతాయి. పెదాలు పొడిగా మారి, చర్మం చీలి ఒక్కోసారి రక్తం కూడా వస్తుంది. ఆ నొప్పి, మంట భరించలేనిది. అందుకే పెదాలు పగలకుండా, పగిలినప్పుడు మృదువుగా చేయడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- బాదం నూనెలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ డి, పొటాషియం, ఐరన్, కాల్షియం, జింక్, ఫాస్పరస్, మాంగనీస్, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఈ పోషక కారకాలు పెదాలను మృదు వుగా మారుస్తాయి. పగుళ్ల రాకుండా రక్షిస్తాయి. స్నానం తర్వాత పెదవులను శుభ్రం చేసి బాదం నూనెను రాసి సున్నితంగా మర్దన చేస్తూ ఉండాలి. దాంతో రోజంతా పెదాలపై తేమ ఉండి పగలకుండా ఉంటాయి.
- కొబ్బరి నూనెలో కొవ్వు ఆమ్లాలు తేమను కలిగిస్తాయి. రోజుకు 2–3 సార్లు పెదవులపై రాయండి. దీంతో పెదవుల నొప్పి నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.
- తేనెలో యాంటిసెప్టిక్, యాంటీబయాటిక్, విటమిన్ బి 1, విటమిన్ బి 6 కూడా సమృద్ధిగా ఉంటాయి. పగిలిన పెదవులకు తేనెతో మర్దన చేయడం వల్ల మంట, నొప్పి వెంటనే తగ్గుతుంది.
- వెన్నలో ఉండే మంచి కొవ్వు పదార్థాలు శరీర గాయాలకు వెంటనే ఉపశమనం కలిగిస్తాయి. ఇందులోని అరాచిడోనిక్ యాసిడ్ పెదాలపై పగుళ్లను ఐదు, ఆరు గంటల్లో తగ్గిస్తాయి. పడుకునే ముందు వెన్న రాసుకుంటే ఉదయాకల్లా పగుళ్లు ఉండవు.
- కలబంద గుజ్జు రాసినా మంచి ఫలితం ఉంటుంది. రాత్రి పడుకునే ముందు పెదాలకు రాసి పడుకుంటే ఉదయం వరకు పెదాలకు కావాల్సిన తేమ అందుతుంది.
- కొన్ని దానిమ్మ గింజలను తీసుకొని జ్యూస్ తీయాలి. ఆ జ్యూస్‌ను ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. రోజూ కొద్ది మొత్తంలో ఆ జ్యూస్‌ను తీసుకొని అందులో కాటన్ బాల్స్ ముంచి వాటితో పెదాలపై సున్నితంగా మర్దన చేయడం వల్ల పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి.
- చలికాలం ఎక్కువగా దాహం వేయదు. కానీ శరీరానికి కావాల్సినంత నీరు అందించాలి. ప్రతి గంటకు ఓ గ్లాసు నీరు తాగడం మంచిది. అప్పుడు పెదవులు, శరీరం పగలకుండా ఉంటాయి.

## 'పంచతంత్రం' ట్రైలర్ విడుదల

బ్రహ్మానందం ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'పంచతంత్రం'. శనివారం ఈ చిత్రం నుండి ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. బ్రహ్మానందనం మాటలతోనే స్టార్ట్ అయ్యిన ఈ ట్రైలర్ మొత్తం ఐదు వేరే వేరే కథలతో మొదలైంది. సీనియర్ నటులు సముద్రఖని, యువ నటీ నటులు నరేష్ అగస్త్య, స్వాతి రెడ్డి, దివ్య ద్రిష్టి, ఆదర్శ్ బాలకృష్ణలు కీలక పాత్రల్లో కనిపించారు. హర్ష పులిపాక దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. శ్రవణ్ భరద్వాజ్, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందించారు. టికెట్ ఫ్యాక్టరీ, ఎస్ ఒరిజినల్స్ బ్యానర్ నిర్మించారు.




## 'హిట్-2 సెన్సార్ పూర్తి

మర్డర్ మిస్టరీ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ 2 : ద సెకండ్ కేస్' చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ మూవీకి సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు. మూవీ రన్ టైమ్‌ని 2 గంటలకు లాక్ చేశారు. అడవి శేష్ హీరోగా నటించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా కనిపించనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. వాల్ పోస్టర్ సినిమాపై నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. డిసెంబర్ 2న భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. అత్యంత కిరాతకంగా హత్యలు చేసే సైకో కిల్లర్ని వెతుక్కుంటూ వెళ్లే పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో అడవి శేష్ నటించిన సినిమా ఇది.

## నిఖిల్ సినిమాలో శింబు గాత్రం

నిఖిల్ నటిస్తున్న '18 పేజెస్' చిత్రం కోసం తమిళ నటుడు శింబు పాట పాడారు. 'టైం ఇవ్వు పిల్ల.. టైం ఇవ్వు' అనే సాంగ్ పాడినట్లుగా తెలుస్తోంది. సంగీత దర్శకుడు గోపీ సుందర్ స్వర సారథ్యంలో శింబు పాడిన ఈ గీతాన్ని త్వరలోనే విడుదల చేయనున్నారు. నిఖిల్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని పల్నాటి సూర్య ప్రతాప్ తెరకెక్కిస్తున్నారు. త్వరలో విడుదల కాబోతున్న ఈ సినిమాకి సుకుమార్ కథ అందించారు. జీఏ2 బ్యానర్ పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. డిసెంబర్ 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు

### గ్రామీణ ఫ్యాక్షన్ నేపథ్యంలో
## 'ఏపీ04 రామాపురం'

రామ్ జాక్కల, అఖిల ఆకర్షణ, పి.యన్ రాజ్, సునీల్ మల్లెం, నటీనటులుగా హేమ రెడ్డి దర్శత్వంలో రామ్ రెడ్డి అందూరి నిర్మించిన చిత్రం 'ఏపీ 04 రామాపురం'. ఆర్ఆర్ క్రియేటివ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్వీ శివారెడ్డి సమర్పిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిగ్ బాస్ ఫేమ్ సోహెల్, జెస్సీ, నటుడు పృథ్వి పాల్గొన్నారు. డిసెంబర్ 9న ఈ సినిమా విడుదలవ్వబోతోంది.

## మరాఠీ నటులు విక్రమ్ గోఖలే కన్నుమూత

ప్రముఖ మరాఠీ థియేటర్ ఆర్టిస్ట్, బాలీవుడ్‌లో పలు సినిమాలు చేసిన విక్రమ్ గోఖలే అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. బాలీవుడ్‌లో మంచి సక్సెస్ సాధించిన 'హం దిల్ దే చుకే సనమ్', 'భూల్ భులయ్య', 'మిషన్ మంగళ్', 'హే రామ్', 'అయ్యారి', తదితర సినిమాలతో పాటు తెలుగులో 'కలవరమాయే మదిలో' మూవీలో కూడా కీలక పాత్రలు పోషించారు. ఇటీవల నవంబర్ 5న గుండె, ఊపిరితిత్తుల సంబంధింత వ్యాధితో పూణేలోని దీనానాథ్ మంగేష్కర్ ఆసుపత్రిలో చేరిన ఆయన ఆరోగ్యం క్షీణించి మరణించినట్లు విక్రమ్ గోఖలే కుటుంబ సభ్యులు ప్రకటించారు. పలువురు ప్రేక్షకాభిమానులతో పాటు సినిమా ప్రముఖులు విక్రమ్ గోఖలే మరణానికి చింతిస్తూ నివాళులు అర్పిస్తున్నారు.

# పోరాడి ఓడిన సౌదీ అరేబియా

## ఫిఫా ప్రపంచకప్

గోల్ చేస్తున్న పోలండ్ స్టార్ ఆటగాడు లావెండోవీస్కి



ఆసీస్ ఆటగాళ్ల సంబరాలు

**దోహా:** ఖతార్ వేదికగా జరుగుతున్న ఫిఫా ప్రపంచకప్ గ్రూప్–సిలో సౌదీ అరేబియా జట్టు పోరాడి ఓటమిపాలైంది. తొలి మ్యాచ్‌లో అర్జెంటీనాపై సంచలన విజయం సాధించిన సౌదీ అరేబియా జట్టు శనివారం పోలెండ్ చేతిలో 2–0గోల్స్ తేడాతో ఓడింది. బంతి ఎక్కువభాగం సౌదీ అరేబియా ఆటగాళ్ల చేతిలో ఉన్నా.. గోల్ చేసే సువర్ణావకాశాలను చేజార్చుకోవడం ఆ జట్టు ఫలితంపై ప్రభావాన్ని చూపింది. పోలండ్ తరపున పియెట్ జిలెనిస్కీ (39వ ని.) తొలి అర్ధభాగంలో కొట్టగా... రెండో అర్ధభాగం సౌదీ ఆటగాళ్లు చేసిన చిన్న తప్పిదంతో 82వ ని.లో స్టార్ ఆటగాడు లావండోవీస్కి మరో గోల్‌ను చేశాడు. గురువారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మెక్సికోపై గెలిస్తేనే సౌదీ అరేబియా జట్టు ప్రి క్వార్టర్స్‌కు చేరనుంది.

**ఆస్ట్రేలియా బోణీ**

గ్రూప్–డిలో ఆస్ట్రేలియా జట్టు బోణీ కొట్టింది. తొలి లీగ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ చేతిలో 4–1 గోల్స్‌తో ఓడిన ఆస్ట్రేలియా జట్టు శనివారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో ట్యునీషియాపై 1–0గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆసీస్ తరపున ఏకైక గోల్‌ను మిఛెల్(23వ ని.) కొట్టాడు. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయలేకపోయాయి. రెండో అర్ధభాగంలోనూ ఇరుజట్లు గోల్ చేయలేదు. అదనపు 6నిమిషాల సమయంలోనూ ఇరుజట్లు గోల్ చేయకపోవడంతో ఆసీస్ గెలుపు ఖాయమైంది. బుధవారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్ ఆస్ట్రేలియా జట్టు డెన్మార్క్‌తో తలపడనుంది.

**ఇంగ్లండ్–అమెరికా, నెదర్లాండ్స్–ఈక్వెడార్ మ్యాచ్‌లు డ్రా**

ఇంగ్లండ్–అమెరికా జట్ల మధ్య శనివారం జరిగిన గ్రూప్–బి మ్యాచ్ డ్రా అయ్యింది. రెండు అర్ధభాగాల సమయం, ఇంజూరీ సమయంలోనూ ఇరుజట్లు ఒక్కగోల్ కూడా నమోదు చేయలేకపోయాయి. దీంతో ఈ మ్యాచ్ 0–0తో డ్రా అయ్యింది. తొలి మ్యాచ్‌లో అమెరికాజట్టు వేల్స్‌తోనూ డ్రాగా ముగించడంతో ఆ జట్టు 2 పాయింట్లతో 3వ స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌లో ఇరాన్‌పై 6–2తో గెలిచి ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో 4పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. గ్రూప్–ఏలో నెదర్లాండ్స్–ఈక్వెడార్‌ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1గోల్స్‌తో డ్రా అయ్యింది. నెదర్లాండ్స్ తరపున కాడీ గప్కో(6వ ని.) ఒక గోల్ కొట్టగా... ఈక్వెడార్ తరపున వెన్నెర్ వాలెన్సియా(49వ ని.) ఒక గోల్ కొట్టాడు. దీంతో గ్రూప్–ఏలో ఈ రెండు జట్లు 4పాయింట్లతో టాప్–2లో కొనసాగుతున్నాయి.

**ఫిఫా ప్రపంచకప్‌లో నేడు...**

గ్రూప్-ఇ: జపాన్ X కోస్టారికా (సా.3.30గం॥లకు)
గ్రూప్-ఎఫ్: బెల్జియం X మొరాకో(రా.6.30గం॥లకు)
కోస్టారికా X కెనడా(రా.9.30గం॥లకు)
గ్రూప్-ఇ: స్పెయిన్ X జర్మనీ(రా.12.30గం॥లకు)

## గెలిస్తేనే నిలిచేది..

### న్యూజిలాండ్‌తో రెండో వన్డే నేడు..
ఉ. 7.00గం॥ల నుంచి డిడి స్పోర్ట్స్‌లో

**హామిల్టన్:** తొలి వన్డేలో భారీ స్కోర్ నమోదు చేసినా.. బౌలర్ల వైఫల్యంతో పరాజయం పాలైన టీమిండియా.. నేడు హామిల్టన్ వేదికగా రెండో వన్డేలో న్యూజిలాండ్‌తో రెండో వన్డేకు సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఈ వన్డేలో భారత్ గెలిస్తేనే సిరీస్ రేసులో నిలవనుంది. తొలి వన్డేలో 300కు పైగా పరుగులు చేసినా బౌలర్లు రాణించకపోవడంతో ఆ వన్డేలో టీమిండియా ఓటమిపాలైంది. కివీస్ మూడు వికెట్లను మాత్రమే పడగొట్టగలిగారు. వెల్లింగ్టన్‌లో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 306పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. న్యూజిలాండ్ జట్టు 47.3ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 308పరుగులు చేసి ఘన విజయం సాధించింది. లాథమ్(145), కెప్టెన్ విలియమ్సన్(94) అజేయంగా క్రీజ్‌లో నిలిచి కివీస్‌ను గెలిపించారు. ఇక టీమిండియా జట్టులో కెప్టెన్ ధావన్‌తోపాటు శుభ్‌మన్, శ్రేయస్ అర్ధసెంచరీలతో రాణించడం ఆ వన్డేలో టీమిండియా 300కు పైగా స్కోర్ చేయగల్గింది. ఈ క్రమంలో ఈ వన్డేలో టీమిండియా గెలిస్తేనే సిరీస్ రేసులో నిలవనుంది.

## ఆకాశ్‌దీప్ హ్యాట్రిక్ వృథా

### ఆసీస్‌తో తొలి టెస్ట్‌లో భారత హాకీ జట్టు ఓటమి

**ఆడిలైడ్:** హాకీ టెస్ట్ సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిపాలైంది. చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 4–5గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో పరాజయంపాలైంది. ఈ మ్యాచ్‌లో భారత ఫ్లార్వర్డ్ ఆటగాడు ఆకాశ్‌దీప్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ చేయడం విశేషం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఒక గోల్ కొట్టాడు. ఆస్ట్రేలియా ఆటగాడు బ్లేక్ గ్రోవర్స్ 60వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్ మలచడంతో 5–4 గోల్స్‌తో విజేతగా నిలిచింది. ఆకాశ్‌దీప్ మ్యాచ్ ఆరంభమైన 9వ నిమిషంలో తొలి గోల్ కొట్టాడు. ఆ తర్వాత 26వ, 58వ నిమిషంలో మరో రెండు గోల్స్ కొట్టి హ్యాట్రిక్ సాధించాడు. దాంతో ఇరుజట్ల స్కోర్ 4–4తో సమమయ్యాయి.

## ఐఓఏ అధ్యక్ష పదవికి పిటి ఉష దరఖాస్తు

**న్యూఢిల్లీ:** మాజీ స్ప్రింటర్, లెజెండ్ పిటి ఉష ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) అధ్యక్ష పదవికి శనివారం దరఖాస్తు చేసుకున్నారు. ట్విటర్ వేదికగా ఆమె ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. 'నా తోటి అథ్లెట్లు, జాతీయ సమాఖ్యల మద్దతు అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఐఓఏ అథ్లెట్ల కమిషన్ ఎంపిక చేసిన అత్యుత్తమ ప్రతిభగల ఎనిమిది మంది అథ్లెట్లలో పిటి ఉష ఒకరు. ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు డిసెంబర్ 10న జరగాల్సి ఉంది. పిటి ఉషతోపాటు 77మంది సభ్యుల ఎలక్టోరల్ కోలేజ్ అధ్యక్షున్ని ఎన్నుకోవాల్సి ఉంది. ఐఓఏ మాజీ అధ్యక్షులు మనిక బత్రా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68